
వాస్తవాలు పలుకు DD9 వార్త
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 132 | 23-09-2026 | బుధవారం | పేజీలు: 10 | వెల: 3/-



క్యాన్సర్ మందుల పేరుతో
దోపిడీ చేస్తారా?

- మెడికల్ మాఫియాపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- రూ.2,700 మందుపై రూ.27 వేల ఎంఆర్‌పీ ఎలా?
- రోగులపై పట్టపగలే దోపిడీ జరుగుతోందన్న ధర్మాసనం
- ధరల నియంత్రణపై కఠిన చర్యలు అవసరమని వ్యాఖ్య
- క్యాన్సర్ చికిత్స కోసం ఇళ్లు, నగలు అమ్ముకుంటున్నారని ఆవేదన

2



వందేమాతరం పూర్తిగా పాడలేదని
చర్యలు తీసుకోవద్దు

- పాడటం.. పాడకపోవడం వ్యక్తిగత నిర్ణయం
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ఆరు చరణాల మార్గదర్శకాలపై కేంద్రానికి నోటీసులు
- టి.ఎం.కృష్ణ పిటిషన్‌పై విచారణ
- వందేమాతరం చట్ట సవరణను సవాల్ చేసిన సంగీత విద్వాంసుడు

2



కూలీల శ్రమకు విలువేది?

- ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం ప్రశ్న
- తక్కువ వేతనాలతో కార్మికుల దుర్భర పరిస్థితి
- శారీరక శ్రమ చేసే వారికి ప్రశాంతమైన నిద్ర అవసరం
- పాశ్చాత్య దేశాల్లో శారీరక శ్రమకు తగిన గౌరవం, వేతనం
- కార్మికుల విషయంలో సమాజం మరింత శ్రద్ధ చూపాలి-
- కూలీపై దాడి కేసులో నిందితుడి శిక్ష తగ్గింపు
- ఐదేళ్ల జైలు శిక్షను మూడేళ్లకు కుదించిన హైకోర్టు
- 2002లో చాందినీ చౌక్‌లో ఘటన
- పాత కక్షలు లేవని గుర్తించిన న్యాయస్థానం



రేవంత్‌కు ఒక న్యాయం..
మహేష్ గౌడ్‌కు ఇంకో న్యాయమా?

- రేవూరిని మళ్ళీ గెలిపించమని పరకాల టూర్‌లో సీఎం పిలుపు..
- ముందే ఎలా ప్రకటిస్తారంటూ పార్టీలోని సీఎం వ్యతిరేకవర్గం రచ్చ..
- ముందస్తుగా ఎవరు ప్రకటించినా చెల్లదన్న పీసీసీ చీఫ్..
- ఇటీవల తన మనసులో మాట బయటపెట్టిన మహేష్‌గౌడ్..
- ఈసారి నిజామాబాద్ జిల్లా నుంచి పోటీ చేస్తానని ప్రకటన..
- తాను అభ్యర్థినని ముందే ఎలా ప్రకటిస్తారన్న ప్రశ్న తెర మీదికి..

హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం ఓ ఆసక్తికరమైన చర్చ హాట్ హాట్‌గా నడుస్తోంది. ఆయన అంటే తప్పు, ఈయన అంటే ఒప్పా అంటూ... రకరకాల విశ్లేషణలు కూడా చేసేస్తున్నారు పార్టీ లీడర్స్. ఇంతకీ... మేటర్ ఏంటంటే...ఆ మధ్య సీఎం రేవంత్ రెడ్డి పరకాల నియోజకవర్గ పర్యటనకు వెళ్ళారు. కాంగ్రెస్ పార్టీకే చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మళ్ళీ గెలిపించాలంటూ పిలుపునిచ్చారు. ఆ పిలుపులో ఆయన ఉద్దేశ్యం ఏదైనాగానీ.....దాని చుట్టూ పార్టీలో పెద్ద పంచాయితేనే నడిచింది. సహజమైన కాంగ్రెస్ కల్చర్‌కు భిన్నంగా ఈసారి కూడా ప్రకాష్‌రెడ్డే అభ్యర్థి అన్నట్టు సీఎం ఎలా ప్రకటిస్తారు, ఎలా పిలుపు నిస్తారంటూ పెద్ద రచ్చే చేశారు. ఆ కథ రకరకాల మలుపులు తిరిగి ఏకంగా ఒక మంత్రిని బర్తరఫ్ చేసేదాకా వెళ్లింది. నిజమేకదా... సీఎం రేవంత్ ఇంత ముందుగా అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారంటూ... కాంగ్రెస్ నేతలు కొందరు ప్రశ్నించారు కూడా. చివరికి PCC అధ్యక్షుడు మహేష్ గౌడ్ కూడా ఆ ప్రశ్నలకు మద్దతు పలికేలా స్టేట్‌మెంట్ ఇవ్వడమే కాదు.... ఎవరు ముందస్తుగా అభ్యర్థుల్ని మిగతా 2 లో..

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే లక్ష్యం

- అణచివేతను అధిగమించేందుకు కలిసి పనిచేద్దాం
- విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధితోనే సామాజిక మార్పు
- అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశం
- 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు అధికారుల వెల్లడి
- బాధితులకు పరిహారం, సహాయ పునరావాసం సకాలంలో అందించాలి
- నష్టపరిహారాన్ని గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని ఆదేశం
- జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచన
- 27.5 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని వెల్లడి
- చదువు, క్రీడల వైపు పిల్లలను ప్రోత్సహించాలని పిలుపు

హైదరాబాద్, (డీడీ9 వార్త):

ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ఉన్నతస్థాయి పర్యవేక్షణ, నిఘా కమిటీ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమావేశంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న సహాయం, పునరావాసంపై సమీక్షించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ స్థాయిలో సమావేశం జరగడం ఇదే తొలిసారి.

ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. అణగారిన వర్గాలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని మిగతా 2లో..



చిన్నారుల మృతికి బాధ్యత ప్రభుత్వానిదే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రిమ్స్‌లో అగ్నిప్రమాదంలో ముగ్గురు చిన్నారులు మృతి
- కరెంట్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం: కేటీఆర్
- మరో 23 మంది చిన్నారులకు గాయాలు
- గాయపడిన పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్
- రిమ్స్‌లో నిర్వహణ లోపాలే ప్రమాదానికి కారణమని ఆరోపణ
- ప్రభుత్వ వైద్య రంగంపై పర్యవేక్షణ కొరవడిందని విమర్శ
- పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయాలని సూచన
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా చర్యలు చేపట్టాలన్న కేటీఆర్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్, (డీడీ9 వార్త):

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో కరెంట్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఘటనలో మరో 23 మంది చిన్నారులు గాయపడిన నేపథ్యంలో వారికి వెంటనే మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య రంగంపై చూపుతున్న నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ప్రమాదం జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. పసిపిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ లోపించిందని, కనీస నిర్వహణ చర్యలు లేకపోవడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని విమర్శించారు. రిమ్స్ ఆసుపత్రిలో నెలకొన్న పరిస్థితులపై బీఆర్ఎస్ జిల్లా నేతలు గతంలో పలుమార్లు ప్రభుత్వాన్ని హెచ్చరించినప్పటికీ స్పందించలేదని కేటీఆర్ అన్నారు. పిల్లల వార్డుల్లో అత్యంత పకడ్బందీగా భద్రతా చర్యలు ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పిల్లల వార్డులు, ఐసీయూలను మిగతా 2లో..



తెలంగాణను ముంచింది బీఆర్ఎస్సే

- మంత్రుల జూపల్లి, వాకిటి విమర్శలు
- రైతులను రెచ్చగొడుతున్నారని ఆరోపణ
- కర్ణాటకతో నీటి కోసం చర్చలు
- ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశామని వెల్లడి
- రైతుల అవసరాల కోసం
- నీళ్లు తీసుకొస్తామని ప్రకటన
- జూరాల వద్ద బీఆర్ఎస్ నేతల
- తీరుపై వాకిటి శ్రీహరి ఆగ్రహం
- అవకాశాన్ని రాజకీయంగా
- వాడుకుంటున్నారని జూపల్లి కృష్ణారావు విమర్శ
- రైతులను భయభ్రాంతులకు
- గురిచేయొద్దని మంత్రుల సూచన

హైదరాబాద్, (డీడీ9 వార్త):

జూరాల ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆందోళనపై మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు తీవ్రంగా స్పందించారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ, నీటి సమస్యను రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. రైతుల అవసరాలను



రైతులంటే ఎందుకింత నిర్లక్ష్యం?..

2

- యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి 400 మెగావాట్లకే పరిమితం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపణ
- విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- 4 వేల మెగావాట్ల సామర్థ్యానికి 400 మెగావాట్లే ఉత్పత్తి
- యాదాద్రిలో నాణ్యత లేని బొగ్గు వాడుతున్నారని ఆరోపణ
- కొత్తగూడెంలో 800 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిందని వెల్లడి
- భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిందని వ్యాఖ్య
- 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఎక్కడని ప్రశ్న
- రైతులకు 78 గంటల విద్యుత్ కూడా అందడం లేదని ఆరోపణ
- విద్యుత్ ఉత్పత్తిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్



హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణలో విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్ 4 వేల మెగావాట్ల పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా ప్రస్తుతం 400 మెగావాట్లకే పరిమితమైందని అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మిగతా 2 లో..

హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన

- భారీగా ట్రాఫిక్ జామ్‌లు
- వాయుగుండం ప్రభావంతో
- నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం
- రోడ్లపైకి చేరిన వరద నీరు
- షేక్‌పేట ఫ్లైఓవర్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్
- రాష్ట్రంలో నేడు కూడా
- భారీ వర్షా లకు అవకాశం
- ఎనిమిది జిల్లాలకు అతి భారీ వర్ష సూచన
- 20 జిల్లాలకు భారీ వర్షం హెచ్చరిక
- ఆరెంజ్ అలర్ట్ జారీ
- చేసిన వాతావరణ శాఖ
- హైదరాబాద్‌లో అధికారులను
- అప్రమత్తం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, (డీడీ9 వార్త):

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, బోయిన్‌పల్లి, దుండిగల్, గాంధీనగర్, రామ్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అంబర్‌పేట, ఎస్‌ఆర్‌నగర్, బోరబండ, కోఠి, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. పలుచోట్ల రోడ్లపై మిగతా 2 లో..

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతే: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

పిలుపునిచ్చారు.
గడిచిన ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. అయితే కొన్ని జిల్లాల్లోని 73 గ్రామాల్లో అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలపై పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సూచించారు.
జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితులకు సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందించాలని సూచించారు. బాధితులను ఆదుకునే విషయంలో బడ్జెట్ పరిమితులతో సంబంధం లేకుండా నష్ట పరిహారాన్ని గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని ఆదేశించారు.
షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయా ఘటనల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
చట్టంపై అవగాహన కార్యక్రమాలు, కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరుపైనా సమావేశంలో సమీక్షించారు. నమోదైన కేసుల దర్యాప్తు, విచారణ, పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలను అధికారులు వివరించారు.
అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని సీఎం తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో 31 శాతం మంది ఎస్సీలు లబ్ధిదారులుగా ఉన్నారని, ఎస్టీ జనాభా 10 శాతం ఉంటే 17 శాతం ఇళ్లను వారికి మంజూరు చేసినట్లు వివరించారు.
రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేయడం ద్వారా దళిత, గిరిజన వర్గాలకు ప్రయోజనం కలుగుతోందని చెప్పారు.
సంక్షేమ పథకాలతోపాటు విద్య ద్వారానే అట్టడుగు వర్గాల జీవితాల్లో శాశ్వత మార్పు వస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.
సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, ఎంపీలు మల్లు రవి, పోరిక బలరాం, కడియం కావ్య, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

తెలంగాణను ముంచింది బీఆర్ఎస్సే

మొదటిపేజీ తరువాయి

దృష్టిలో పెట్టుకుని కర్ణాటక ప్రభుత్వంతో నీటి అంశంపై చర్చిస్తున్నామని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ కూడా రాశామని తెలిపారు.
జూరాల వద్ద బీఆర్ఎస్ చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు, తాగునీటి అవసరాలకు కావాల్సిన నీటి పరిమాణంపై అవగాహన లేకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశం ఆ పార్టీకి లేదని ఆరోపించారు.
నీటి కేటాయింపుల విషయంలో గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వాకిటి శ్రీహరి ప్రస్తావించారు. 811 టీఎంసీల్లో 299 టీఎంసీలు సరిపోతాయని నాడు చెప్పింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. నీటి విషయంలో రాష్ట్రానికి నష్టం కలిగించింది గత ప్రభుత్వమేనని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని విమర్శించారు.
బీఆర్ఎస్ నేతలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. రైతుల కోసం అవసరమైతే కర్ణాటక ప్రభుత్వాన్ని సంప్రదించి నీటిని కోరడంలో తప్పేముందని ప్రశ్నించారు. నీటి సమస్య పరిష్కారం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.
నీటి సమస్యపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, త్వరలో నీటిని తీసుకురాబోతున్నామని బీఆర్ఎస్ నేతలకు కూడా తెలుసని జూపల్లి అన్నారు. అందుకే జూరాల వద్ద ఆ పార్టీ నేతలు హడావుడి చేస్తున్నారని ఆరోపించారు. రైతులను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.
పాలమూరు జిల్లా గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని జూపల్లి అన్నారు. అబద్ధాలను ప్రజలు నమ్ముతారని ఆ పార్టీ భ్రమపడుతోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జూరాల ప్రాజెక్టులో పూడిక ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో వాస్తవంగా ఎంత నీరు అందుబాటులో ఉందో అంచనా వేసే పరిస్థితి లేకపోవడానికి గత పాలనలో తీసుకున్న చర్యలే కారణమని ఆరోపించారు.
ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యతపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని జూపల్లి కోరారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పరిష్కార మార్గాలు సూచించాలే తప్ప, ప్రస్తుత పరిస్థితిని రాజకీయంగా ఉపయోగించుకోవద్దని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

చిన్నారుల మృతికి బాధ్యత ప్రభుత్వానిదే

మొదటిపేజీ తరువాయి

నిపుణులతో తనిఖీ చేయించాలని కేటీఆర్ సూచించారు. విద్యుత్ వ్యవస్థ, అగ్నిమాపక భద్రత, ఇతర మౌలిక వసతులను పరిశీలించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు.
ప్రమాదంలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉన్నాయని కేటీఆర్ అన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాయపడిన చిన్నారులకు మెరుగైన చికిత్స అందించడంతోపాటు వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కోరారు.

క్యాన్సర్ మందుల పేరుతో దోపిడీ చేస్తారా?



హైదరాబాద్, (డీడీ9 వార్త):

క్యాన్సర్ మందుల అధిక ధరలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రిటైలర్లకు కేవలం రూ.2, 700కే సరఫరా అవుతున్న ఓ క్యాన్సర్ ఔషధంపై రూ.27 వేల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) ముద్రించడంపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ఇలాంటి ధరల నిర్ణయాన్ని అరాచకంగా అభివర్ణిస్తూ.. రోగులపై పట్టపగలే దోపిడీ జరుగుతున్నట్లుగా ఉందని వ్యాఖ్యానించింది.
ఔషధాల ధరలపై కఠిన నియంత్రణలు తీసుకురావాలని, జనరిక్ మందులను సూచించని వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన రెండు వేర్వేరు పిటిషన్లను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది.
విచారణ సందర్భంగా క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే కొన్ని మందుల ఎంఆర్‌పీ, రిటైలర్లకు సరఫరా చేసే ధర కంటే పదిరెట్లు అధికంగా ఉంటోందని ధర్మాసనం పేర్కొంది. ఇది అరాచకమని, దీన్ని దోపిడీ అనకపోతే మరేమని ప్రశ్నించింది. క్యాన్సర్ చికిత్స కోసం ప్రజలు తమ ఇళ్లు, నగలను విక్రయించాల్సిన పరిస్థితులు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. చికిత్స కోసం ఆధారపడే రోగులను ఇలా ఎలా మోసం చేస్తారని ప్రశ్నించింది.
ఔషధాల ధరల నిర్ణయమే ఈ వ్యవహారంలో ప్రధాన సమస్యగా ధర్మాసనం పేర్కొంది. రిటైలర్లకు సరఫరా ధరకు, మందులపై ముద్రించే ఎంఆర్‌పీకి మధ్య ఇంత భారీ వ్యత్యాసం ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసింది. ధరల నియంత్రణకు బాధ్యత వహించే అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంపైనా ధర్మాసనం ప్రశ్నలు లేవనెత్తింది. ఔషధ ధరల నియంత్రణ, జనరిక్ మందుల వినియోగానికి సంబంధించిన పిటిషన్లపై విచారణను కొనసాగించిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

హైదరాబాద్ ను ముంచెత్తిన వాన

మొదటిపేజీ తరువాయి

నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
వర్షం కారణంగా షేక్‌పేట ఫ్లైఓవర్ పద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదలడంతో రహదారులపై రద్దీ పెరిగింది. భారీ వర్షం కురుస్తున్న సమయంలో అనవసర ప్రయాణాలను రద్దు చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు సూచించారు.
వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఎనిమిది జిల్లాలకు అతి భారీ వర్షం, 20 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు వెల్లడించింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ తదితర జిల్లాలతో పాటు ఉమ్మడి వరంగల్ ప్రాంతానికి అతి భారీ వర్షసూచన ఇచ్చింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.
హైదరాబాద్‌లో వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లను అప్రమత్తం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రోడ్లు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని సూచించారు.
అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు.



రైతులంటే ఎందుకింత నిర్లక్ష్యం?..

మొదటిపేజీ తరువాయి


ఆయన మాట్లాడారు.
కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించామని హరీశ్‌రావు చెప్పారు. ప్లాంట్‌కు జీ10, జీ11 నాణ్యత కలిగిన బొగ్గు అవసరమని, అయితే జీ13, జీ14 నాణ్యత కలిగిన బొగ్గును వినియోగిస్తున్నారని ఆరోపించారు. బొగ్గు వినియోగంలో నాణ్యతా లోపాలు ఉన్నాయని విమర్శించారు. కొత్తగూడెం విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని హరీశ్‌రావు అన్నారు. భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో 540 మెగావాట్ల ఉత్పత్తి ఆగిపోయిందని తెలిపారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని గతంలో చెప్పిన నేపథ్యంలో ప్రస్తుతం బొగ్గు కొరత ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు.
బొగ్గు నిల్వల పరిస్థితిని తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. విద్యుత్ కేంద్రాల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు ప్రజాప్రతినిధులను అనుమతించాలని అన్నారు.
రాష్ట్ర విభజన సమయంలో ఎన్టీపీసీ ద్వారా తెలంగాణకు 1,600 మెగావాట్ల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారని హరీశ్‌రావు తెలిపారు. తొలివిడతగా 800 మెగావాట్ల ఎన్టీపీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుని విద్యుత్ పొందిందని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ఎందుకు ఆసక్తి చూపడం లేదని ప్రశ్నించారు. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వినియోగించకుండా రాజస్థాన్ ప్రభుత్వంతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ఎందుకు కుదుర్చుకున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాజస్థాన్‌కు విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం ఏముందని నిలదీశారు.
రైతులకు విద్యుత్ సరఫరా విషయంలోనూ ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో



అందించిన విద్యుత్ ఉత్పత్తిలో మూడో వంతు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని అన్నారు. రైతులకు 7 నుంచి 8 గంటల విద్యుత్ కూడా అందడం లేదని ఆరోపించారు. థర్మల్ పవర్ స్టేషన్లలో కనీసం 45 రోజుల బొగ్గు నిల్వలు ఉండాలని హరీశ్‌రావు అన్నారు. విద్యుత్ కొరత, బొగ్గు నిల్వల సమస్యలపై ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
శ్రీశైలం నీటిని కుప్పం ప్రాంతానికి తరలిస్తున్నారంటూ ఏపీ ప్రభుత్వంపైనా హరీశ్‌రావు విమర్శలు చేశారు. శ్రీశైలం నుంచి సుమారు 700 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు కృష్ణా జలాలను తరలిస్తున్నారని ఆరోపించారు. బేసిన్‌కు సంబంధం లేని ప్రాంతాలకు నీటిని తరలిస్తున్నారని వ్యాఖ్యానించారు.
తెలంగాణలోని ప్రాజెక్టులకు నీటిని తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. వాతావరణ పరిస్థితులకు సంబంధించి ఎల్‌నినోను కారణంగా చూపుతున్నారని విమర్శించారు. ఏపీలో రైతులు ఆనందంగా ఉంటే తెలంగాణలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుపైనా హరీశ్‌రావు స్పందించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రి సీతక్క తల్లిదండ్రులకు పోడు పట్టాలు ఇచ్చామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఒత్తిడి తెచ్చిన తర్వాతే రాష్ట్ర మంత్రులు కర్ణాటకకు వెళ్లి నీటి అంశంపై చర్చిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

వందేమాతరం పూర్తిగా పాడలేదని చర్యలు తీసుకోవద్దు

- పాడటం.. పాడకపోవడం వ్యక్తిగత నిర్ణయం
- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- ఆరు చరణాల మార్గదర్శకాలపై కేంద్రానికి నోటీసులు
- టి.ఎం.కృష్ణ పిటిషన్‌పై విచారణ
- వందేమాతరం చట్ట సవరణను సవాల్ చేసిన సంగీత విద్వాంసుడు
- 1986 నాటి తీర్పును ప్రస్తావించిన సుప్రీంకోర్టు
- కేంద్రం నుంచి రెండు వారాల్లో సమాధానం కోరిన ధర్మాసనం
- జాతీయ గీతంతో సమానమైన చట్టపరమైన రక్షణపై విచారణ
- తదుపరి విచారణకు కేసు వాయిదా



హైదరాబాద్, (డీడీ9 వార్త):

వందేమాతరం ఎన్నిచరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగత నిర్ణయమని సుప్రీంకోర్టు పేర్కొంది. పూర్తి వందేమాతరం పాడని వ్యక్తిపై కేవలం ఆ కారణంతో క్రిమినల్ చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. ఆరు చరణాల వందేమాతరం ఆలాపనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, చట్ట సవరణపై దాఖలైన పిటిషన్‌పై మంగళవారం విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.
ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టి.ఎం.కృష్ణ ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను పాడాలన్న కేంద్ర మార్గదర్శకాలను ఆయన సవాల్ చేశారు. పాటలోని చివరి చరణాల్లో మతపరమైన అంశాలు ఉన్నందున వాటిని తప్పనిసరిగా ఆలపించాలనే నిబంధన వ్యక్తిగత స్వేచ్ఛ, లౌకిక విలువలకు సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతోందని పిటిషన్‌లో పేర్కొన్నారు.
ఈ ఏడాది జనవరి 28న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని పేర్కొంది. జాతీయ గీతంతో కలిసి వందేమాతరం ఆలపించినప్పుడు ముందుగా పూర్తి జాతీయ గీతాన్ని పాడాలని, ఆ తర్వాత జనగణమన ఆలపించాలని మార్గదర్శకాల్లో సూచించింది. కేసు విచారణ సందర్భంగా మతపరమైన లేదా మనస్సాక్షికి సంబంధించిన కారణాలతో వందేమాతరం పాడేందుకు నిరాకరించే వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం ప్రశ్నార్థకమని సుప్రీంకోర్టు పేర్కొంది. 1986లో జాతీయ గీతం విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన బిజోయ్ ఇమ్మాన్యుయేల్ తీర్పులోని సూత్రాలను కూడా ధర్మాసనం ప్రస్తావించింది.
వందేమాతరం ఆలాపనను నిరోధించడం లేదా అడ్డుకోవడంపై 2026లో తీసుకొచ్చిన చట్ట సవరణలో నిబంధనలు చేర్చిన నేపథ్యంలో, వాటి పరిధి, అమలుపైనా సుప్రీంకోర్టు పరిశీలన కొనసాగుతోంది.
కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాలు, చట్ట సవరణపై రెండు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం కోరింది. పిటిషన్‌పై తదుపరి విచారణను కోర్టు వాయిదా వేసింది.

రేవంత్‌కు ఒక న్యాయం.. మహేష్ గౌడ్‌కు ఇంకో న్యాయమా?

మొదటిపేజీ తరువాయి

ప్రకటించినా... చెల్లదని కూడా తేల్చి చెప్పేశారు. పార్టీలోని రేవంత్ వ్యతిరేక వర్గానికి ఆ స్టేట్‌మెంట్ బలం ఇచ్చినట్లు అయింది. సీన్ అక్కడ కట్ చేస్తే.... తాజాగా మహేష్‌గౌడ్ నోటి నుంచే అదే తరహా మాటలు రావడం పార్టీలో కొత్త చర్చకు దారితీసింది..
పిసిసి చీఫ్‌గా ఆయన బాధ్యతలు తీసుకుని రెండేళ్లు పూర్తయిన సందర్భంగా... మీడియాతో చిట్ చాట్ చేశారు మహేష్. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా నుంచి పోటీ చేస్తానని ఆ సందర్భంగా చెప్పారాయన. ఏ నియోజకవర్గం అన్నది తర్వాత చెబుతానన్నారు. సరే... ఆయనేదో క్యాజువల్‌గా అన్నారు, ప్రత్యేకించి ఫలానా నియోజకవర్గం అని కూడా చెప్పలేదు కాబట్టి...ఇప్పుడే అంత సీరియస్‌గా తీసుకుని చర్చ పెట్టాల్సిన అవసరం లేదని అనుకున్నారట పార్టీ లీడర్స్ అంతా. కానీ...పీసీసీ చీఫ్ ప్రకటన ఉమ్మడి నిజామాబాద్ కాంగ్రెస్‌లో అలజడి రేపింది. ఎందుకంటే... సొంత జిల్లా అయినా.... నిజామాబాద్‌లో మహేష్‌గౌడ్‌కు సొంత నియోజకవర్గం అంటూ ఏదీ లేదు. పైగా ప్రస్తుతం అన్ని నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలో, లేదా పార్టీ ఇన్‌ఛార్జ్‌లో ఉన్నారు. ఎక్కడా ఖాళీ లేకపోవడంతో... పీసీసీ అధ్యక్షుడు వచ్చి ఎవరి సీటుకు ఎర్త్ పెడతారోనన్న టెన్షన్ జిల్లా నాయకుల్లో మొదలైంది. ఆ టెన్షన్‌లో నుంచే సరికొత్త డిస్కషన్ కూడా బయటికి వచ్చింది. మొన్న... పరకాలలో సిట్టింగ్ ఎమ్మెల్యేని తిరిగి గెలిపించమంటూ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తే...రచ్చ చేసిన పీసీసీ చీఫ్... ఇప్పుడు తనకు తానుగా నేను పోటీ చేస్తానని ఎలా ప్రకటిస్తారంటూ లాజిక్ తీశారు జిల్లా లీడర్స్. ఇక పార్టీలోని రేవంత్ టీమ్ కూడా దీని గురించి అక్కడక్కడా చర్చ పెడుతున్నట్టు తెలుస్తోంది. ఐతే.... వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన మహేష్‌గౌడ్‌కు ఎప్పటి నుంచో ఉంది. ఆర్మూర్ నుంచి బరిలో దిగుతారన్న ప్రస్తావన కూడా వచ్చింది. ఇదే సమయంలో ఆయన తన మనసులోని మాట బయటపెట్టడం, అందుకు జిల్లాలో రియాక్షన్స్ తేడాగా ఉండటంతో.... హస్తంలో గరంగరం చర్చలు నడుస్తున్నాయి.




కూలీల శ్రమకు విలువేది?

- ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం ప్రశ్న
- తక్కువ వేతనాలతో కార్మికుల దుర్భర పరిస్థితి
- శారీరక శ్రమ చేసే వారికి ప్రశాంతమైన నిద్ర అవసరం
- పాశ్చాత్య దేశాల్లో శారీరక శ్రమకు తగిన గౌరవం, వేతనం
- కార్మికుల విషయంలో సమాజం మరింత శ్రద్ధ చూపాలి-
- కూలీపై దాడి కేసులో నిందితుడి శిక్ష తగ్గింపు
- ఐదేళ్ల జైలు శిక్షను మూడేళ్లకు కుదించిన హైకోర్టు
- 2002లో చాందినీ చౌక్‌లో ఘటన
- నిద్రకు భంగం కలిగించవద్దన్నందుకు కూలీపై దాడి
- పాత కక్షలు లేవని గుర్తించిన న్యాయస్థానం

హైదరాబాద్, (డీడీ9 వార్త):

దేశంలోని కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. శారీరక శ్రమ చేసే కార్మికులకు తక్కువ వేతనాలు లభిస్తున్నాయని, వారి సంక్షేమంపై తగిన శ్రద్ధ లేదని పేర్కొంది. రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోవడం కార్మికులకు ఎంతో అవసరమని, మరుసటి రోజు కఠినమైన పనులకు వారు సిద్ధం కావాల్సి ఉంటుందని తెలిపింది.
కూలీపై దాడి కేసులో నిందితుడు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. శారీరక శ్రమకు పాశ్చాత్య దేశాల్లో తగిన వేతనం, గౌరవం లభిస్తాయని పేర్కొన్న న్యాయస్థానం.. ఈ విషయంలో భారతీయ సమాజం విఫలం కావడం దయనీయమని వ్యాఖ్యానించింది.
2002లో ఢిల్లీలోని చాందినీ చౌక్ మార్కెట్‌లో రాజిందర్ కుమార్ అనే కార్మికుడు తాను పనిచేస్తున్న దుకాణం ఆవరణలో నిద్రపోతున్నారు. అదే సమయంలో వీర్‌పాల్ అనే వ్యక్తి మరికొందరితో కలిసి అక్కడ గొడవ సృష్టించడంతో రాజిందర్ నిద్రకు భంగం కలిగింది. దీంతో అక్కడ గొడవ చేయవద్దని వారిని ఆయన వారించారు. దీనిపై ఆగ్రహించిన వీర్‌పాల్ పదునైన ఆయుధంతో రాజిందర్‌పై దాడి చేశాడు. ఘటనపై అతడిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ వీర్‌పాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. కేసును విచారించిన ఉన్నత న్యాయస్థానం.. రాజిందర్, నిందితుడి మధ్య గతంలో ఎలాంటి కక్షలు లేవని గుర్తించింది. ఈ నేపథ్యంలో ట్రయల్ కోర్టు విధించిన ఐదేళ్ల శిక్షను మూడేళ్లకు తగ్గించింది.
ఈ సందర్భంగా కార్మికుల పరిస్థితిపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కఠినమైన శారీరక శ్రమ చేసే వారు మరుసటి రోజు పనులకు సిద్ధం కావాలంటే రాత్రిపూట ప్రశాంతమైన నిద్ర ఎంతో అవసరమని పేర్కొంది. దేశంలోని కార్మికులకు తక్కువ వేతనాలు లభిస్తున్నాయని, వారి శ్రమకు తగిన విలువ, గౌరవం ఇవ్వడంలో సమాజం విఫలమైందని వ్యాఖ్యానించింది.





జనగామజిల్లా స్థాయి చెస్ పోటీల్లో మెరిసిన గురుకుల విద్యార్థి మేకల రిశ్విక్ యాదవ్

జనగామ, : సెప్టెంబర్22(డిడి 9) వార్త

జనగామవిద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. క్రీడలు విద్యార్థులలో ఆలోచనా శక్తిని, ఏకాగ్రతను మరియు నిర్ణయాత్మక సమర్థతను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు.
జిల్లా కేంద్రంలోని సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో 'గుడాల ఫ్యామిలీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో జనగామ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మేకల రిశ్విక్ యాదవ్ ప్రథమ బహుమతి సాధించి సైకిల్‌ను గెలుపొందాడు. విజేత రిశ్విక్ యాదవ్‌కు ఎమ్మెల్యే స్వయంగా బహుమతిని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గుడాల శ్రీనివాస్, వేణు, శ్రీధర్, ఫౌండేషన్ డైరెక్టర్ కాసాల సంతోష్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, మేకల సమ్మయ్య, రాజ్‌కుమార్, రిత్విక్ కుమార్, వర్షిత్ కుమార్, మేకల ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం, గుండ్లగడ్డ కిష్టబావి అన్న ప్రసాదవితరణ

- **ముఖ్య అతిథులుగా వై చైర్మన్ భూష పర్వతాలు సేవేలి మధు 26 వార్డ్ సుగుణాకర్ వైస్ చైర్మన్ ఉల్లెంగుల నర్సింగ్ తాటి కుమార్**

జనగామ జిల్లా. (డిడి9) వార్త

జనగామ పట్టణంలో గుండ్లగడ్డ కిష్టబావి 9వ రోజు గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి దాత: మెట్టు సురేష్,వందన, దుబ్బాక బాలయ్య, పద్మ, ఆ గణనాథుడు వారికి, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు, ఇంకా ఉన్నత పదవులు పొందే విధంగా ఆయన కరుణ,కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. కమిటీ సభ్యులు గౌరవ అధ్యక్షులు: వడ్డుల లింగమూర్తి అధ్యక్షులు: గట్టు రమేశ్ ఉపాధ్యక్షులు: చిదురాల బాబురావు కోశాధికారి: కోయల్ కార్ శేషు విరాట్ జీ
ప్రధాన కార్యదర్శి: గుధినేని త్రయంబకేశ్ సహాయ కార్యదర్శులు: ఆకుల నరేష్ గోగికర్ శివాజి కొత్తపల్లి సత్తయ్య ఆర్గనైజర్: చెల్లోజు నవీన్ చారి ముఖ్య సలహాదారులు: ఎర్రమళ్ళ సుధాకర్, దుబాయ్ శ్రీనువాస్, గట్టు దామోదర్, మిర్యాల రమేష్,ఆకుల శ్రీనివాస్,ఎనగందుల సుధాకర్, మిల్కీ ప్రవీణ్, రోకాటి మురళి, గట్టు కిరణ్, కార్యవర్గ సభ్యులు, కట్కూరి శ్రీను,మామిడాల శంకర్, బాలదే యోగేష్ కట్కూరి మహేష్,సిరిమల్లె అనిల్ బొల్లం నరేష్, నార్ల సాయి, బొల్లం కార్తీక్, సాయబోయిన సాయి, రమేష్, నీలం రవితేజ, శ్రీనాథ్, మహిళా సోదరులు పిల్లలు వాడకట్టు సభ్యులు ప్రముఖులు పాల్గొన్నారు,





మణుగూరు కరాటే మాస్టర్స్‌కు గ్లోబల్ అవార్డులు..

- **ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

మణుగూరు. సెప్టెంబర్ 22(డి డి 9వార్త)

భద్రాద్రి జిల్లా,మణుగూరుకు చెందిన కరాటే మాస్టర్ కాసిమల్ల పద్మ, గుగులోత్ రిషిక గ్లోబల్ స్థాయిలో అవార్డులు అందుకోవడం పట్ల పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.
మణుగూరుకు చెందిన సీనియర్ కరాటే మాస్టర్ కాసిమల్ల పద్మ బ్లాక్ బెల్ట్ 4వ డాన్ విభాగంలో గ్లోబల్ మాస్టర్ అవార్డు అందుకోగా, గుగులోత్ రిషిక బ్లాక్ బెల్ట్ 1వ డాన్ విభాగంలో గ్లోబల్ స్టార్ కిడ్ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా కాసిమల్ల పద్మ, గుగులోత్ రిషిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శాలువాలతో సత్కరించి అభినందించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన వారు గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ రంగాల్లో యువత మరింతగా రాణిస్తూ ఉన్నత స్థాయిలో గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మణుగూరు ప్రాంతానికి మంచి పేరు,ప్రఖ్యాతులు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.







పినపాక నియోజకవర్గం లోని పోడు భూముల సమస్యలపై.. అటవీ శాఖ అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

మణుగూరు. సెప్టెంబర్ 22 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పినపాక నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో గిరిజన రైతులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ జిల్లా అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్, నిషా, ఉప అటవీ సంరక్షణ అధికారి బాబు తదితర అధికారులను కలిసి సమస్యలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే పాయం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోడు భూములకు సంబంధించిన సమస్యలు, భూములపై హక్కులు, అటవీ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలు,రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజన రైతుల జీవనోపాధికి సంబంధించిన పోడు భూముల సమస్యను సానుకూలంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. అర్హులైన గిరిజన రైతులకు ప్రభుత్వ తరుపున న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
పినపాక నియోజకవర్గంలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరియు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పాయం తెలిపారు. పోడు భూముల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడకుండా, వారి సమస్యలకు పరిష్కారం దిశగా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలను పరిశీలించి, సంబంధిత సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

అక్టోబర్ 14వ తేదీన చలో హైదరాబాద్ – ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నా

- **ఐదవ షెడ్యూల్ రక్షణ, 1/70 చట్టం అమలు, అటవీ హక్కులు, స్థానిక ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్**

తాడ్వాయిDD9 వార్త

మేడారం: ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించాలని, గిరిజన భూములు-అటవీ వనరులను కాపాడాలని, స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 14వ తేదీన “చలో హైదరాబాద్ - ఆదివాసీల ఆత్మఘోష మహా ధర్నా” నిర్వహించాలని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. మేడారం సమ్మక్క-సారలమ్మ సన్నిధిలో ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి తుడుందెబ్బ జాతీయ కార్యదర్శి పొదెం కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. సమావేశంలో వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొని ఆదివాసీ హక్కులు, భూమి, అటవీ వనరులు, ఉపాధి తదితర అంశాలపై చర్చించారు.

ఐదవ షెడ్యూల్‌ను సమర్థంగా అమలు చేయాలి

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1)కు అనుసంధానమైన ఐదవ షెడ్యూల్ ద్వారా షెడ్యూల్డ్ ఏరియాస్‌కు ప్రత్యేక పరిపాలనా, రక్షణ వ్యవస్థను కల్పించారని ప్రతినిధులు పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీల భూమి, జీవనోపాధి, సామాజిక ప్రయోజనాలు మరియు రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు ఐదవ షెడ్యూల్ నిబంధనలను సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

1/70 నిబంధనలను కఠినంగా అమలు చేయాలి

గిరిజన భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా నిరోధించేందుకు అమలులో ఉన్న 1/70 భూ బదలాయింపు నిబంధనలను సమర్థంగా అమలు చేయాలని సంఘాల ప్రతినిధులు కోరారు. గిరిజన భూములపై అక్రమ ఆక్రమణలు, వివాదాలు, బదలాయింపులను అరికట్టి భూమి హక్కులను రక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అటవీ హక్కుల పట్టాలు, సామూహిక హక్కులు గుర్తించాలి

అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006 (Forest Rights Act) ప్రకారం అర్హులైన ఆదివాసీకుటుంబాలకు వ్యక్తిగత అటవీహక్కుల పట్టాలు, గ్రామ సమూహాలకు సామూహిక అటవీ హక్కులను గుర్తించి హక్కుల పట్టాల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అటవీ ఆధారిత జీవనోపాధి, మేత, నీటి వనరులు, సంప్రదాయ వనరుల వినియోగం, సామూహిక అటవీ వనరుల సంరక్షణ వంటి హక్కులను చట్టపరంగా పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

స్థానిక ఆదివాసీ యువతకు ఉపాధి కల్పించాలి

ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. 29 ప్రభుత్వ శాఖల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక విధానం రూపొందించాలని కోరారు. జీవో ఎంఎస్ నం.3కు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగ మరియు న్యాయపరమైన పరిమితులకు అనుగుణంగా స్థానిక ఆదివాసీ యువత ప్రయోజనాలను కాపాడే చట్టబద్ధమైన పరిష్కారం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

లంబాడీల ఎస్టీ హోదా తొలగించాలని డిమాండ్

ఆదివాసీ సంఘాలు తమ ప్రధాన డిమాండ్ల లో లంబాడీల ఎస్టీ హోదా తొలగించాలని కోరుతున్నాయి. ఈ అంశాన్ని ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం మరియు సంబంధిత రాజ్యాంగ సంస్థల దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ అంశంపై తుది నిర్ణయం రాజ్యాంగం, చట్టాలు మరియు సంబంధిత అధికారిక ప్రక్రియలకు అనుగుణంగా ఉండాలని సంఘాలు స్పష్టం చేశాయి.

హక్కులతో కూడిన ఆదివాసీ అభివృద్ధి కావాలి

ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి కేవలం రహదారులు, భవనాలు, సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా భూమి హక్కు, అటవీ హక్కు, విద్య, వైద్యం, ఉపాధి, స్థానిక వనరులపై హక్కు, గ్రామస్థాయి నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలతో కూడి ఉండాలని ప్రతినిధులు అన్నారు.

ప్రధాన డిమాండ్లు

ఐదవ షెడ్యూల్ రాజ్యాంగ రక్షణలను సమర్థంగా అమలు చేయాలి.



గిరిజన భూముల రక్షణకు 1/70 నిబంధనలను కఠినంగా అమలు చేయాలి.
అర్హులైన ఆదివాసీలకు అటవీ హక్కుల పట్టాలు మంజూరు చేయాలి.
వ్యక్తిగత హక్కులతో పాటు సామూహిక అటవీ హక్కులను గుర్తించాలి.
ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలి.
29 ప్రభుత్వ శాఖల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక విధానం రూపొందించాలి.
జీవో ఎంఎస్ నం.3కు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిశీలించి చట్టబద్ధమైన పరిష్కారం చూపాలి.
లంబాడీల ఎస్టీ హోదాపై పునఃపరిశీలన చేయాలనే డిమాండ్‌పై సంబంధిత ప్రభుత్వాలు, రాజ్యాంగ సంస్థలు చట్టపరమైన ప్రకారం స్పందించాలి.
ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి.

చలో హైదరాబాద్ – ఆదివాసీల ఆత్మఘోష మహాధర్నాకు పిలుపు

ఆదివాసీల రాజ్యాంగ హక్కులు, భూమి-అటవీ హక్కులు, స్థానిక యువత ఉపాధి, ఆదివాసీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు “చలో హైదరాబాద్ - ఆదివాసీల ఆత్మఘోష మహా ధర్నా” నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటించింది. ఆదివాసీ ప్రజలు, యువతీ యువకులు, మహిళలు, విద్యార్థులు, వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ప్రజాస్వామ్య పద్ధతిలో పాల్గొనిమహాధర్నానువిజయవంతంచేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది.
ఈ కార్యక్రమంలో మెట్ట పాపయ్య ఆధార్ సొసైటీ, వట్టంఉపేందర్‌జాతీయఅధ్యక్షులుతుడుందెబ్బ, రమణాల లక్ష్మయ్య జాతీయ ప్రధాన కార్యదర్శి తుడుందెబ్బ , సిద్ధబోయిన జగ్గారావు పూజారుల సంఘం అధ్యక్షులు , మడి సాయి బాబు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదివాసి సేన , గెడంజనార్దన్AEWCAరాష్ట్రప్రధానకార్యదర్శి, పాయం సత్య నారాయణ రాష్ట్ర అధ్యక్షులు గొండ్వానా సంక్షేమ పరిషత్, గొప్ప వీరయ్య మన్యసీమ రాష్ట్ర అధ్యక్షులు , కోర్సా నరసింహా మూర్తి రాష్ట్ర అధ్యక్షులు ఆదివాసి నవ నిర్మాణ సేన , కోటే రవి రాష్ట్ర అధ్యక్షులు AIAEF, పూనెం సాయి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొండ్వానా సంక్షేమ పరిషత్, వజ్జ నరసింహ రావు రాష్ట్ర అధ్యక్షులు గిరిజన అభ్యుదయ సంఘం, పూనెం రామచందర్ రాష్ట్ర అధ్యక్షులు భూమి పుత్ర ఆదివాసి సంఘం, కబ్బాక శ్రావణ్ కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుడుందెబ్బ, సిద్ధబోయిన సురేందర్ సమ్మక్క పూజారి , పెండకట్ల రాంబాబు ఆదివాసి ఉద్యోగుల సంఘం,కనక రామారావు AEWCA సీనియర్ నాయకులు, అరెం ప్రశాంత్ GSS రాష్ట్ర నాయకులు, నాయకపోడ్ సేవా సంఘం నాయకులు, తుడుందెబ్బ రాష్ట్ర బాధ్యులు గుంపిడి వేంకటేశ్వర్లు, వట్టం కన్నయ్య, గంట సత్యం, చింత కృష్ణ,మడవి వెంకటేష్, దుగ్గరపు వీరభద్రం, చందా మహేశ్, సువర్ణపక వెంకటరత్నం, ఈసం నర్సింగరావు, వట్టం సురేష్,వాసం నాగరాజు ANS వర్కింగ్ ప్రెసిడెంట్,తాడ్వాయి మండల అధ్యక్షులు చందా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శంగా మదర్ థెరిస్సా ట్రస్ట్ సభ్యులు కృష్ణయ్య జన్మదిన వేడుకలు

- **అనాథ పిల్లల మధ్య కేకే జన్మదిన వేడుకలు**
- **కారుణ్య ఆశ్రమానికి రూ.3 వేల నిత్యావసర వస్తువుల వితరణ**

భద్రాచలం టౌన్, సెప్టెంబరు 22 డిడి9 వార్త

జన్మదిన వేడుకలను అనాథ పిల్లల మధ్య నిర్వహించడంతో పాటు వారికి నిత్యావసర వస్తువులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు సీహెచ్. కృష్ణయ్య (కేకే). తన జన్మదినాన్ని పురస్కరించుకుని భద్రాచలం శ్రీరామ్‌నగర్ కాలనీలోని కారుణ్య అనాథాశ్రమంలోని చిన్నారులకు రూ.3 వేల విలువైన నిత్యావసర వస్తువులను అందజేశారు. అనంతరం అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి మాట్లాడుతూ.. జన్మదినం వంటి ప్రత్యేక సందర్భాల్లో తమ సంపాదనలో కొంత భాగాన్ని అనాథ పిల్లల సంక్షేమం కోసం ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. సాధారణంగా జన్మదిన వేడుకలను రెస్టారెంట్లు, ఇతర వినోద కార్యక్రమాలతో జరుపుకునే పరిస్థితుల్లో.. అందుకు భిన్నంగా అనాథ పిల్లల మధ్య వేడుకలు నిర్వహించి వారికి అవసరమైన వస్తువులను అందించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
ప్రతి ఒక్కరూ తమ జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు వంటి ప్రత్యేక సందర్భాలను అనాథ పిల్లల మధ్య నిర్వహించి, తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమాజంలోని ఆపన్నులకు అండగా నిలవడమే నిజమైన మానవ సేవ అని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పేరాల నాగేంద్ర, హరికృష్ణ, అశోక్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



SIR ప్రక్రియను పరిశీలించిన... ప్రజా ప్రతినిధులు..

మణుగూరు. సెప్టెంబర్ 22(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం, సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గల మీటింగ్ హాల్లో జరుగుతున్నటువంటి SIR ప్రక్రియను మంగళవారం నాడు సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,BLO మరియు BLA లకు తగిన సూచనలు చేశారు.SIR ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎస్కే రహీం పాషా, BLO లు, BLA ద్వాలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ గణేష్ రెడ్డి, కొమరం రామ్మూర్తి, కోటియా తదితరులు పాల్గొన్నారు.



అక్రమ బెల్ట్ షాపులను తక్షణమే రద్దు చేయాలి

- **యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి – పీవైఎల్ నాయకుల డిమాండ్**

గుండాల, సెప్టెంబర్ 22 (డీడీ9 వార్త):

గుండాల మండలం కొడవటంచ గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) గ్రామ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి వుకే శ్రావణ్ అధ్యక్షత వహించారు.
ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఈసం శంకరన్న, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పూనేం మంగయ్య మాట్లాడారు.
దేశ భవిష్యత్తులో యువత పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు.
యువత సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వాలు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు.
అయితే యువత మత్తు పదార్థాల బారిన పడటం ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు.
గుండాల మండలంలోని 54 గ్రామాల్లో 146 బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని వారు ఆరోపించారు.
వైన్ షాపుల ముసుగులో అక్రమ విక్రయాలు జరుగుతున్నాయని విమర్శించారు.
గుట్కా, గుడుంబా, గంజాయి, డ్రగ్స్ విక్రయాలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.
ఈ పరిస్థితి యువత భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.
గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న 146 బెల్ట్ షాపులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
గుడుంబా, డ్రగ్స్ మాఫియాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.
గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.
నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు.



యువతకు ఉపాధి భరోసా కల్పించేలా జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.
ప్రభుత్వాలు తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని పీవైఎల్ నాయకులు కోరారు.
లేనిపక్షంలో యువత, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో వజ ధర్మరాజు, కోడెం కృష్ణయ్య, కొమరం నరేందర్, ఈసం కరణ్, ఈసం భాస్కర్, ఈసం హరేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈసం కృష్ణముక్తి, ఈసం రజనీకాంత్, కొటెం సుధాకర్, బాలరాజు, చీమల ప్రసాద్, చీమల సుందరరావు, కల్తి సందీప్, చీమల కొయ్య పాల్గొన్నారు.

వరంగల్ ఎంజీఎం దగ్గర మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం..

- **ఈ రాష్ట్ర లో శాంతిభద్రతలు లేవు -- పోలీసులే రౌడీయిజం చేస్తున్నారు.**
- **రోగులను పరామర్శించి, ఆసుపత్రి దుస్థితి పరిశీలించడం నేరమా...!!?**
- **వినయ్ భాస్కర్ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గం..**
- **దాడి చేసిన పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకొని,సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్..**
- **పినపాక మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు.**

మణుగూరు. సెప్టెంబర్ 22(డి డి 9వార్త)



పాలన చేతగాని దద్దమ్మలు, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షం మీద దాడులు చేయిస్తున్నారు. ప్రతిపక్ష నేతలను అణగ తొక్కాలని చుస్తే అంతకు రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళతాం అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు.
రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, మా నాయకుల మీద అక్రమ కేసులు ఈ ప్రభుత్వం పతనానికి నాంది అని ఆయన అన్నారు.ఈ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం డైవర్షన్ కోసం ప్రతిపక్షాన్ని అణగదొక్కుతున్నారని రేగా కాంతారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
రేవంత్ రెడ్డి నీ ప్రభుత్వం పని అయిపోయింది. రోజులు లెక్కపెట్టుకో.. మీకు రోషం ఉంటె ఆరు గ్యారంటీలు అమలు చెయ్యి.
వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే, నువ్వు, నీ కాంగ్రెస్ నేతలు, నీకు చెంచాగిరి చేస్తున్న పోలీసులు ఇంతకు పదిరెట్లు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది అని రేగా కాంతారావు హెచ్చరించారు.వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రోగులను పరామర్శించి, ఆసుపత్రి దుస్థితిని పరిశీలించడానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ పై దాడి చేయడం హేయమైన చర్యగా రేగా అభివర్ణించారు.
ఈ దాడిని భద్రాద్రి జిల్లా బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన తెలిపారు.
రాష్ట్రంలో శాంతి భద్రతలు నానాటికీ క్షీణిస్తున్నాయని,పోలీసులే రౌడీయిజం చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఇంతకు ఇంత కలిపి చెల్లిస్తామని అన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందజేత..

మణుగూరు. సెప్టెంబర్ 22 (డి డి 9వార్త)

భద్రాద్రి జిల్లా, మణుగూరు మండలం లోని తోగ్గుడెం గ్రామ పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు రెండవ జత యూనిఫాం ను అందజేశారు. తోగ్గుడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మడకం కృష్ణ సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు సార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ కొమరం మహేష్, టీచర్ శారద మేడం తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు

- **తొమ్మిదో రోజు ప్రత్యేక పూజల్లో దంపతులు**

బోనకల్, సెప్టెంబర్ 22 (డీడీ9 వార్త):

మండల కేంద్రంలో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం తొమ్మిదో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గయ్యపేట రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక మండపం భక్తులతో కిక్కిరిసింది.
కోణతాలపల్లి నాగేశ్వరరావు-కృష్ణవేణి దంపతులు, సుగ్గల వెంకట వీర బ్రహ్మాంజనేయులు-శ్రావణి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకాలు, అర్చనలు, హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ప్రజలకు ఆయురారోగ్యాలు, గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని గణనాథుని ప్రార్థించారు. తొమ్మిది రోజుల ఉత్సవాలకు బుధవారం నిమజ్జన మహోత్సవంతో ముగింపు పలకనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నిమజ్జన వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.




మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం..

- **ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

మణుగూరు.సెప్టెంబర్ 22(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఇరిగేషన్ మరియు వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సభాస్థలి, డెలివరీ పాయింట్, హెలిప్యాడ్ ప్రాంతాలను తనిఖీ చేశారు.
ప్రధాన పరిశీలనాంశాలు:
సభాస్థలి పరిశీలన: గొందిగూడెంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని పరిశీలించి, హాజరయ్యే ప్రజలు, నాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు పకడ్బందీగా కల్పించాలని అధికారులను ఆదేశించారు.
మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్ వద్ద జరుగుతున్న పనుల పురోగతిని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకుని, ప్రారంభోత్సవానికి పనులను వేగవంతం చేయాలని సూచించారు.
మంత్రుల రాక కోసం మారెళ్లపాడులో సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించి, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రుల పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించి, మార్గ మధ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు మరియు అధికారులను కోరారు. మంత్రుల పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దిష్ట గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





నాగులవంచలో ఘనంగా బాలగణేష్ ఉత్సవాలు

- **నవరాత్రోత్సవాల్లో అన్నదానం**

చింతకాని,సెప్టెంబర్ 22 (డీడీ9 వార్త):

మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని ఎన్ఎస్పీ క్వార్టర్స్‌లో శ్రీ బాలగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మూడో వార్షికోత్సవం సందర్భంగా గణపతి నవరాత్రోత్సవాలు, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మత్కేపల్లి మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, గజగిరి లక్ష్మీనరసింహస్వామి, శ్రీ కోదండ రామస్వామి దేవాలయ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సీనియర్ జర్నలిస్టు అంబటి శాంతయ్యతో పాటు వార్డు సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ హోదాల్లోని నాయకులు, అఖిలపక్ష నాయకులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



విద్యార్థులకు స్టీల్ గ్లాసులు పంపిణీ చేసిన రావినూతల మాజీ సర్పంచ్ వజీర్

- **వజీర్ సేవాభావం అభినందనీయం గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు**

బోనకల్,సెప్టెంబర్ 22, (డీడీ9 వార్త):

రావినూతల మాజీ సర్పంచ్ ఎస్.కె. వజీర్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల కోసం 50 స్టీల్ గ్లాసులను ఆయన అందజేశారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలో రాగిజావ, పాలను సద్వినియోగం చేసుకునేందుకు ఈ గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ దామాల పుల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అవసరాలను గుర్తించి దాతలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమన్నారూ,వజీర్ వంటి దాతలు విద్యార్థుల సంక్షేమం కోసం అందిస్తున్న సహకారం పాఠశాలలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.
ముష్టికుంట్ల సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి 50 స్టీల్ గ్లాసులను అందించిన వజీర్‌కు అభినందనలు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య చికిత్సకు రూ.5 లక్షల ఎల్‌వోసీ అందజేత

- **నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**
- **పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వ పెద్దపీట: ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

భద్రాచలం, సెప్టెంబరు 22 (డిడి9 వార్త)

అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు భరోసానిచ్చారు. వాజేడు మండలం చిన్నగొల్లగూడెం గ్రామానికి చెందిన బోల్లె ముత్యాలరావు తీవ్ర మైన న్యూరో సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పేదరికంలో మగ్గుతున్న ఆ కుటుంబం వైద్య ఖర్చులు భరించలేక సాయం కోరగా.. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల విలువైన ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని మంజూరు చేయించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ముత్యాలరావు కుటుంబ సభ్యులకు ఈ పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని స్పష్టం చేశారు. కష్టకాలంలో తమను ఆదుకున్న ఎమ్మెల్యేకు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



వినాయకుల వద్ద అన్నదానం.... భారీగా పాల్గొన్న భక్తులు

తూప్రాన్ సెప్టెంబర్ 22 (డిడి9 వార్త)

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో మంగళవారం రోజు అంబేద్కర్ సంఘం మరియు శ్రీ సూర్య చంద్ర అసోసియేషన్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రుల సందర్భంగా మహా అన్నదానం ఏర్పాటు చేశారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు కార్యక్రమం కాంగ్రెస్ బి ఆర్ ఎస్ నాయకులు హాజరై తీర్థ ప్రసాదులు స్వీకరించి వినాయకుడి ఆశీస్సులు పొందరు కాంగ్రెస్ నాయకులు ఆంక్ష రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ మున్సిపల్ కౌన్సిలర్ లు పార్టీ నాయకులు పాల్గొన్నారు బి ఆర్ ఎస్ మున్సిపల్ చైర్మన్ బొంది రజని రవీందర్ గౌడ్ మాజీ శివ్వం పేట్ ఎంపీపీ హరికృష్ణ మున్సిపల్ కౌన్సిలర్ లు నాయకులు స్థానిక డిఎస్పీ నరేందర్ గౌడ్ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు







వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు..

- **మూడు నిమజ్జన ప్రాంతాల గుర్తింపు.. భద్రతపై అధికారుల ప్రత్యేక దృష్టి..**

సెప్టెంబర్ 22.డిడి9 వార్త వెంకటాపురం.

వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు వెంకటాపురం మండలంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మంగళవారం మండల కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి సంజీవరావు అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. బలకట్ట వాగు-పాత్రాపురం, జిన్నల వాగు-బోదాపురం, పుష్కర ఘాట్-రామచంద్రపురం ప్రాంతాలను అధికారికంగా నిమజ్జన ప్రదేశాలుగా గుర్తించారు. భక్తులు, ఉత్సవ కమిటీలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ గుర్తించిన నిమజ్జన ప్రాంతాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. నిమజ్జన ఘాట్ల వద్ద తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్యం, బారికేడింగ్, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా భక్తుల రద్దీ, వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా విధులు కేటాయించారు.

సీఐ ఎం. రమేష్, ఎస్ఐ కే. తిరుపతిరావు నిమజ్జన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు.

ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం. వేణుగోపాల్, ఎంపీఓ బొగ్గ నారాయణ, ఎస్ఐ తిరుపతి రెడ్డి, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినయ్ భాస్కర్‌పై పోలీసుల దాడిని ఖండించిన కాసాని పద్మ...

అశ్వారావుపేట:సెప్టెంబర్ 22(డిడి 9 వార్త)



వరంగల్ MGM ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే, BRS నాయకుడు దాస్యం వినయ్ భాస్కర్‌పై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలను అశ్వారావుపేట BRS నాయకురాలు కాసాని పద్మ తీవ్రంగా ఖండించారు.

ఆసుపత్రిలో పైకప్పు పెచ్చులు కూలి గాయపడిన బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకుని దాడి చేశారని BRS నేతలు ఆరోపించారు. ఈ ఘటనలో ఆయన చేతికి గాయమైందని పార్టీ నేతలు పేర్కొన్నారు.

కాసాని పద్మ మాట్లాడుతూ' ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఆసుపత్రికి వెళ్లిన ప్రజాప్రతినిధిపై ఈ విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం వంటి చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

వినయ్ భాస్కర్‌పై జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాసాని పద్మ డిమాండ్ చేశారు. వినయ్ భాస్కర్ త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనాల్టీలు రద్దు చేయాలి

- **న్యాయమైన రేట్‌కార్డు అమలు చేయాలని టాక్సీ డ్రైవర్ల ధర్నా**


హైదరాబాద్, సెప్టెంబరు 22:(డిడి 9వార్త) బ్యూరో

శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో టాక్సీ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌టీయూ టాక్సీ, గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. పోస్టర్లు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. బీఆర్‌టీయూ ఉపాధ్యక్షుడు, టాక్సీ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అత్తినమోని నాగేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

విమానాశ్రయంలో ప్రయాణికుడిని దింపిన అనంతరం ఎనిమిది నిమిషాల్లోపు బయటకు రాకపోతే విధిస్తున్న రూ.500 పెనాల్టీని వెంటనే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఓలా, ఉబర్, రాపిడో తదితర అగ్రిగేటర్ సంస్థల టాక్సీలకు పెరిగిన ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులకు అనుగుణంగా న్యాయమైన కిలోమీటర్ రేట్‌కార్డును అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం 2022లో జారీ చేసిన జీవో ఎంఎస్ నం.46 కంటే తక్కువ కాకుండా సవరించిన రేట్లను అమలు చేయాలని పేర్కొన్నారు.

28లోపు పరిష్కరించాలి

ఎయిర్‌పోర్టు టాక్సీల రేట్‌కార్డును సెప్టెంబరు 28లోపు పెంచి అమలు చేయాలని బీఆర్‌టీయూ డిమాండ్ చేసింది. అప్పటిలోగా సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబరు 29 నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పెద్దఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించింది. కార్యక్రమంలో బీఆర్‌టీయూ హైదరాబాద్ నాయకులు గాజులపాటి నరేష్, పొన్నం రాజుగౌడ్, రాజగిరి ఆనంద్, రాంపల్లి మహేందర్‌గౌడ్, తయాబ్‌తో పాటు పలువురు టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.



గిరిజన ఏజెన్సీ యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలి...

- **సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, గిరిజన ప్రజాప్రతినిధులు, మంత్రులు...**
- **ఉద్యోగ నియామకాల్లో ప్రత్యేక కోటా అమలు చేయాలని వినతి...**

అశ్వారావుపేట:సెప్టెంబర్ 18(డిడి9 వార్త)



గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లోని యువతకు ఉద్యోగ నియామకాల్లో 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో పలువురు గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తో కలిసి ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కొమరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఇతర గిరిజన ప్రజాప్రతినిధులు ఏజెన్సీ ప్రాంతాల యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఏజెన్సీ యువతకు

ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా 2026 పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన పోస్టుల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

మారుమూల గిరిజన గ్రామాల్లోని యువతకు విద్య, శిక్షణ, రవాణా తదితర సదుపాయాలు పరిమితంగా ఉండటంతో సాధారణ పోటీ ప్రక్రియలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజాప్రతినిధులు వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని స్థానిక యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

అశ్వారావుపేట నియోజకవర్గ

యువత తరపున ఎమ్మెల్యే విజ్ఞప్తి

అశ్వారావుపేట నియోజకవర్గంలో గిరిజన ఏజెన్సీ ప్రాంతాలు విస్తారంగా ఉన్నాయని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోని అనేక గ్రామాలకు చెందిన గిరిజన యువత ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారని వివరించారు.

ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న యువతకు 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయని, తద్వారా గిరిజన కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో కూడా మార్పు వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గత ప్రత్యేక నిబంధనలను

పరిగణనలోకి తీసుకోవాలి

ఏజెన్సీ ప్రాంతాలకు గతంలో అమలైన ప్రత్యేక రిజర్వేషన్ నిబంధనలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, గెజిట్ నోటిఫికేషన్లను పరిశీలించి ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలో కూడా 75 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు.

చట్టపరమైన, పరిపాలనా అంశాలను పరిశీలించి ఏజెన్సీ ప్రాంతాల స్థానిక గిరిజన యువతకు ప్రయోజనం కలిగే విధంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రులు, గిరిజన ప్రజాప్రతినిధుల దృష్టి

ఈ అంశాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన యువతకు ఉద్యోగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి దనసరి అనసూయ సీతక్క, మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తదితరులు ఉన్నారు.

అయితే వీరందరూ ఈ ప్రత్యేక భేటీలో పాల్గొన్నారని కాకుండా, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులుగా మాత్రమే ఈ సందర్భంలో ప్రస్తావించబడుతున్నారు.

పోలీస్ ఉద్యోగాల భర్తీ

నేపథ్యంలో కీలక డిమాండ్

రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఏజెన్సీ యువతకు 75 శాతం రిజర్వేషన్ డిమాండ్ ప్రాధాన్యత సంతరించుకుంది. పోలీస్ ఉద్యోగాల కోసం గిరిజన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువత సిద్ధమవుతున్న నేపథ్యంలో, నియామకాల్లో తమకు ప్రత్యేక కోటా కల్పించాలని వారు కోరుతున్నారు. స్థానిక గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. పోలీస్ శాఖలో స్థానిక యువతకు అవకాశాలు లభిస్తే గిరిజన ప్రాంతాల్లోనే ఉద్యోగ అవకాశాలు పెరగడంతో పాటు యువతలో ప్రభుత్వ ఉద్యోగాలపై మరింత ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

యువత భవిష్యత్తును దృష్టిలో

పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలి

ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కోరారు. ఉద్యోగ అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గించి, స్థానికంగానే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక విధానాలు అవసరమని తెలిపారు. ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలోనే ఏజెన్సీ ప్రాంతాల యువతకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రిని కోరారు.

సీఎం నిర్ణయంపై గిరిజన యువతలో ఆసక్తి

75 శాతం రిజర్వేషన్ డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఏజెన్సీ ప్రాంతాల గిరిజన యువతలో ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం సంబంధిత నిబంధనలు, చట్టపరమైన అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని యువత కోరుతోంది.

పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 శాతం ప్రత్యేక రిజర్వేషన్ అమలు చేయాలన్న డిమాండ్‌పై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఏజెన్సీ ప్రాంతాల నిరుద్యోగ యువత ఎదురుచూస్తోంది. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు.



తెలుగు భాషపై పట్టుకై ఐటీడీఏ పీవో స్పెషల్ ఫోకస్

- **పలు అంశాల్లో పోటీలు ఆడి పాడిన గిరి బిడ్డలు మాతృభాష మాధుర్యం వర్ణించలేనిది. అందులో తెలుగు భాష తీయదనం తెలియనిది కాదు.**

భద్రాచలం టౌన్ 22 సెప్టెంబరు 26 (డీ డీ9 వార్త)

భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఐఏఎస్ తెలుగు భాష పరిరక్షణకు ఎంతగానో పాటుపడుతున్నారు. గిరిజన విద్యాలయాల్లో తెలుగు భాష గొప్పతనాన్ని మరింత ఇనుమడింప చేసేలా బాల బాలికలను ప్రోత్సహిస్తున్నారు. అందులో భాగంగా రకరకాల పోటీలు నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగులో కవితలు, శీర్షికలు, పద్యాలు, ఒక నిమిషం పాటు తెలుగులో మాట్లాడటం, ఏక పాత్రాభినయం, క్విజ్ పోటీలు మంగళవారం గిరిజన భవన్లో నిర్వహించారు. ఈ పోటీల్లో బాలబాలికలు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొంటున్నారు. తెలుగుతనం ఉట్టిపడేలా సాగిన ఈ సాంస్కృతిక పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు ప్రశంసా పత్రాలను ఐటీడీఏ పీవో అందజేశారు.

భాష పటుత్వం కోసం ...

ఐటీడీఏ చరిత్రలోనే తెలుగు భాషా పటుత్వం కోసం జరిగిన ప్రయత్నంగా ఐటీడీఏ పీవో రాహుల్ చర్యను అభివర్ణించవచ్చు.తెలుగు భాష అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్ ఐఏఎస్ ని పలువురు అభినందిస్తున్నారు

పిల్లల్లో సృజనాత్మకత వెలుగులోకి వస్తుంది

రాహుల్, ఐఏఎస్, ఐటీడీఏ పీవో భద్రాచలం

తెలుగు భాషపై పట్టు కోసం

వివిధ రకాల పోటీలు నిర్వహించటం జరుగుతుందని తద్వారా పిల్లల్లో సృజనాత్మక శక్తి పెంపొందుతుందని, మాతృభాషపై మరింత విజ్ఞానం కలుగుతుందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు దేశభాషలందు తెలుగు లెస్స అన్న తెలుగు కవుల మాటలు అక్షర సత్యం అని వ్యాఖ్యానించారు.



ఐటీడీఏ నివాస గృహాలలో వరసిద్ధి వినాయకుని మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్

భద్రాచలం టౌన్, 22 సెప్టెంబర్ 26 (డీ డీ 9 వార్త)

హిందువులు ఏ శుభకార్యం తలపెట్టిన మొట్ట మొదటిగా పూజించేది విఘ్నేశ్వరునని తొలి పూజలు అందుకొనే వినాయకుడు విఘ్నాలను తొలగించే దేవుడని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆన్నారు.

మంగళవారం నాడు ఐటిడీఏ కార్యాలయం లోని ఉద్యోగులు నివాసం ఉంటున్న సముదాయంలో వరసిద్ధి వినాయక గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు వరసిద్ధి వినాయక గణపతి భక్తమండలి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వరసిద్ధి వినాయకునికి తన కుమారుడు అద్వత్ హావన్ తో కలిసి పూజలు చేసి భక్తులందరికీ భోజనాలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ భక్తి భావంతో కలిసిమెలిసి ఉండే విధంగా కుల మతాలకు తావు లేకుండా ఉండడం కోసమే ఈ పండుగలు జరుపుకుంటామని,తొమ్మిది రోజులపాటు విశేష పూజలు నిర్వహించి ప్రతిరోజు చిన్నపిల్లలతో మొదలుకొని పెద్దల వరకు ఉత్సాహంగా వివిధ సంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ఐటీడీఏ నివాస గృహ సముదాయం చాలా సందడితో కనువిందు చేయించిన మహిళలకు మరియు చిన్నారులకు అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు.

ముఖ్యంగా ఐటీడీఏ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది అందరూ ఐకమత్యంతో ఉండడం వలన ఇటువంటి కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని,మహిళ ఉద్యోగులను మాత్రం తప్పనిసరిగా అభినందించాల్సి ఉందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని శ్రీమతి చందన ఆర్సిఓ గురుకులం అరుణకుమారి ఏటిడీవోలు చంద్రమోహన్ రాధమ్మ మరియు ఐటీడీఏ విభాగంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవరాత్రులు మంగపేట విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న తాటి. వెంకటేశ్వర్లు..

అశ్వారావుపేట:సెప్టెంబర్ 22(డిడి 9 వార్త)

ములకలపల్లి మండలంలోని మంగపేట గ్రామంలో మాజీ సర్పంచ్ వాడే నాగరాజు, ఉప సర్పంచ్ వాడే నరసింహారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా మండపంలో ప్రతిష్ఠించిన శ్రీ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను తాటి అభినందించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు తాటి వెంకటేశ్వర్లును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాటి మాట్లాడుతూ శ్రీ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బైటి రాజేష్,జమిలి లక్ష్మణ్, చరణ్, కృష్ణస్వామి, మడివి జంపన్న, తో పాటు గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చింతలమోరిలో.. చిన్నబడి ఏర్పాట్లు..!

- **అడవిలోనే చిగురించనున్న చదువుల సరస్వతి**
- **గొత్తెకోయ గిరిజన పిల్లలకు అక్షర వెలుగులు..**
- **సీతక్క ఆదేశాలతో కదిలిన కాంగ్రెస్ నాయకులు**

ఏటూరునాగారం క్రైం, డి.డి.9 వార్త, సెప్టెంబర్ 21

అడవినే ఆవాసంగా చేసుకుని జీవిస్తున్న గొత్తెకోయ గిరిజన గూడెంలో ఇక చదువుల వెలుగులు చిగురించనున్నాయి.ఏళ్లుగా విద్యకు దూరంగా ఉంటున్న చిన్నారులకు వారి గూడెంలోనే ప్రాథమిక విద్య అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.చింతలమోరి గొత్తెగూడెంలోనే చిన్నబడి ఏర్పాటు చేసేందుకు ఏటూరునాగారం కాంగ్రెస్ నాయకులు చర్యలు చేపడుతున్నారు.ములుగు జిల్లా తాడ్వాయి సమీపంలోని చింతలమోరి అటవీ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ నుంచి బతుకుదెరువు కోసం ఏళ్ల క్రితం వలస వచ్చి సుమారు 50 గొత్తెకోయ కుటుంబాలు నివసిస్తున్నాయి.అడవిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఈ కుటుంబాల్లో చాలా మందికి చదువు అందని ద్రాక్షగానే మారింది. గూడెం సమీపంలో పాఠశాల లేకపోవడంతో చిన్నారులు విద్యకు దూరంగా ఉంటూ వస్తున్నారు.



పాఠశాల దూరం..

విద్యకు దూరమైన చిన్నారులు...

చింతలమోరి గూడెం నుంచి పాఠశాలకు వెళ్లాలంటే ఏటూరునాగారం లేదా తాడ్వాయి వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. చిన్నపిల్లలను అంతదూరం పంపించడం ఇబ్బందిగా ఉండటంతో చాలామంది తల్లిదండ్రులు వారిని పాఠశాలకు పంపలేకపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో చిన్నారుల బాల్యం అడవిలోనే గడుస్తూ,అక్షరాస్యతకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.




చింతలమోరిపై సీతక్క దృష్టి...

గూడెంలో నెలకొన్న విద్యా సమస్యపై మంత్రి సీతక్క దృష్టి సారించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గిరిజన చిన్నారులు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో వారి నివాస ప్రాంతంలోనే బడి ఏర్పాటు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.దీంతో చింతలమోరి గొత్తెగూడెంలో చిన్నబడి ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ నాయకులు ముందుకు వచ్చారు.

గుడిసెలోనే బడి..

గిరిజన పిల్లలకు అక్షర వెలుగులు...

గూడెంలోనే అందుబాటులో ఉన్న గుడిసెలో చిన్నబడి ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించేందుకు నాయకులు సన్నద్ధమవుతున్నారు. బడి అందుబాటులోకి వస్తే ఇప్పటివరకు విద్యకు దూరంగా ఉన్న చిన్నారులు తమ గూడెంలోనే చదువుకునే అవకాశం లభించనుంది. అడవిలో జీవిస్తున్న గొత్తెకోయ గిరిజన కుటుంబాల పిల్లలకు విద్యను చేరువ చేయడం ద్వారా వారి భవిష్యత్తుకు బాటలు వేయాలనే ప్రయత్నం జరుగుతోంది. చింతలమోరిలో ప్రారంభం కానున్న ఈ చిన్నబడి గిరిజన చిన్నారుల జీవితాల్లో అక్షర వెలుగులు నింపుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.





అడవిబిడ్డల జీవితాల్లో విద్యా వెలుగులు..!!

- **గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే వెలుగుబాట..!**
- **అడవుల్లోని బిడ్డలకు అక్షర జ్ఞానం.. సీతక్క సంకల్పం..!**
- **విద్యకు దూరమైన గిరిజన చిన్నారులకు ప్రభుత్వం అండ..!**
- **విద్యార్థులకు మెరుగైన వసతులే లక్ష్యం..!**
- **మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు..**

ఏటూరునాగారం క్రైం, డి.డి.9 వార్త, సెప్టెంబర్ 22

అడవుల్లో నివసించే గిరిజన బిడ్డలు ఇక విద్యకు దూరం కాకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది.మారుమూల గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతోంది.ఇందులో భాగంగా ఏటూరునాగారం మండలంలోని గంటలకుంట,మామిడిగూడెంలో ఏర్పాటు చేసిన కంటైనర్ పాఠశాలలు గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు విద్యా వెలుగులు నింపనున్నాయి.

రేపు మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం..

గంటలకుంట, మామిడిగూడెంలో ఏర్పాటు చేసిన కంటైనర్ పాఠశాలలను రేపు రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఉల్లాస్ అండ్ టాస్ కోఆర్డినేటర్ పీర్ల కృష్ణబాబు పాఠశాలలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, విద్యా వాతావరణంపై అధికారులతో చర్చించారు.

విద్యార్థులతో మమేకమైన కృష్ణబాబు...

పాఠశాలను సందర్శించిన కృష్ణబాబు విద్యార్థులు,ఉపాధ్యాయులతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాలలో అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.విద్యార్థుల భద్రత,సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.



అడవిబిడ్డల చదువుకు ప్రభుత్వ అండ....

గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా అవసరమైన చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అడవుల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాల పిల్లలకు విద్యను చేరువ చేయడంలో కంటైనర్ పాఠశాలలు కీలకంగా మారనున్నాయి. ఇప్పటివరకు విద్యా వసతుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులకు ఈ పాఠశాలలు కొత్త ఆశలు నింపనున్నాయి. సీతక్క ఆదేశాలతో చేపడుతున్న ఈ కార్యక్రమం గిరిజన విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్యతో పాటు పలువురు నాయకులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





సామ్రాజ్యవాదంపై సమరభేరి మోగించాలి

- **షాహిద్ భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడాలి: బి.మల్లేష్**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 22(డీడీ9 వార్త):

అమెరికా ఆధిపత్య ధోరణులు, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా పోరాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 119వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం బోధన్ పట్టణంలోని బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిడిఎస్‌యూ, పిఎల్, పిఓడబ్ల్యూల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. పిఓడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. షాహిద్ భగత్ సింగ్ చూపిన ధైర్యం, త్యాగం, సామాజిక మార్పు కోసం సాగించిన పోరాట స్ఫూర్తితో యువత, విద్యార్థులు, మహిళలు ముందుకు సాగాలన్నారు. ప్రపంచ శాంతి, సామాజిక న్యాయం కోసం ప్రజల ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా మాజీ నాయకురాలు ఎస్. మౌనిక, టియుసిఐ పట్టణ నాయకుడు ఎండి ఇర్షాద్, పిఎల్ నాయకుడు డి. నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సౌర 'సిరి'.. గ్రిడ్‌కు అనుసంధానమైన సోలార్ ప్లాంట్

- **2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ విజయవంతంగా ప్రారంభం**

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 22(డీడీ9 వార్త):

రైతుల ఆర్థిక పురోగతికి, పునరుత్పాదక ఇంధన ప్రోత్సాహానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం కుసుమ్A పథకం కింద ఏర్పాటు చేసిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. బోధన్ డివిజన్ పరిధిలోని హున్సా 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని టాక్లీ గ్రామంలో 1 మెగావాట్ చొప్పున రెండు యూనిట్లుగా ఏర్పాటు చేసిన ఈ సోలార్ ప్లాంట్‌ను విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానించి టెక్నికల్‌గా ఛార్జ్ చేశారు. సర్కిల్ ఎస్ఈ పి.వి. రాజేశ్వర్ రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక విద్యుత్ వ్యవస్థలోకి సౌర విద్యుత్‌ను అనుసంధానించడం వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా రైతులకు అదనపు ఆదాయ మార్గాలు సుగమమవుతాయన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈలు వెంకటరమణ, ముక్తార్, ఏడీఈ నగేష్‌కుమార్, ఏఈలు, సోలార్ ప్లాంట్ యజమానులైన రైతులు ఉప్పలపాటి సుబ్బారావు, డాక్టర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హున్సా సర్పంచ్ శివకుమార్, గ్రామస్థులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.





జిల్లా స్థాయి పోటీలకు 144 మంది క్రీడాకారుల ఎంపిక..!

- **క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనిఫార్మ్‌లు అందజేత**
- **విద్యార్థులు క్రీడల్లో రాణించి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి**

శాయంపేట, సెప్టెంబర్ 22,డి డి 9వార్త

హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలోని బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్14, అండర్17 ఖోఖో, కబడ్డీ,వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన 144 మంది బాలబాలికలకు శాయంపేట పోలీసుల సహకారంతో నరసింహారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పరకాల ఏసీపీ చిర్ర సతీష్ బాబు,పరకాల రూరల్ సీఐ వై. సుధాకర్ రెడ్డి, స్థానిక ఎస్ఐ జక్కుల పరమేశ్వర్,ట్రస్ట్ ప్రతినిధి ప్రశాంత్ పాల్గొని క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనిఫార్మ్‌లను అందజేశారు.

క్రీడాకారులకు

అధికారుల అభినందనలు....

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల ఏసీపీ సతీష్ బాబు,సీఐ సుధాకర్ రెడ్డి, స్థానిక ఎస్ఐ జక్కుల పరమేశ్వర్, శాయంపేట ఎంఈఓ బిక్షపతి హాజరయ్యారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన 144 మంది క్రీడాకారులను వారు అభినందించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ,పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి శాయంపేట మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అవసరమైన క్రీడా దుస్తులను అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన 144 మంది బాలబాలికలకు నిర్వాహకులు శుభాకాంక్షలు తెలుపుతూ రాబోయే పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ హెచ్ఎస్ బాలుర పాఠశాల హెచ్ఎం జనార్దన్, పీడీ డా. సూరం రామ్ రెడ్డి, తరంగిణి, గీత, జ్యోతి, ధన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమ చిన్నారులకు అన్నదానం

నిజామాబాద్, సెప్టెంబర్ 22 (డీడీ9 వార్త):

గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కమ్మర్ పల్లి మండలం బషీరాబాద్ గ్రామ యువత సేవా కార్యక్రమం చేపట్టారు. ఆర్మూర్‌లోని తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థలోని అనాథ ఆశ్రమ చిన్నారులకు ఒకరోజు భోజనాన్ని ఏర్పాటు చేసి అన్నదానం చేశారు.

అన్నదానం అంటే ఒక పూట భోజనం లేని వారికి చేయూత అందించాలనే ఉద్దేశంతో ఉండాలని భావించి, గణపతి ఉత్సవాల సందర్భంగా అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు భోజనం అందించినట్లు యువత తెలిపారు. పండుగను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమం నిర్వహించడం ద్వారా సమాజానికి తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్ బాయ్స్ యూత్ అధ్యక్షుడు జగడం సురేష్, సభ్యులు పృథ్వి, అనిల్, అరుణ్, ఉదయ్, నితిన్, పవన్, భరత్, సాయి, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : సీపీ సాయి చైతన్య హెచ్చరిక

- **నిజామాబాద్‌లో 572 మంది బైండోవర్**
- **గణేశ్ నిమజ్జనం వేళ పోలీసుల ముందస్తు చర్యలు**

నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 22(డీడీ9 వార్త):

వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత ముందస్తు చర్యలు చేపట్టినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 572 మందిని అదుపులోకి తీసుకుని, సంబంధిత తహసీల్దార్ల ఎదుట హాజరుపరిచి చట్టప్రకారం బైండోవర్ చేసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో 280 మంది, ఆర్మూర్ డివిజన్‌లో 175 మంది, బోధన్ డివిజన్‌లో 117 మందిపై ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, సున్నితమైన ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తుతో పాటు నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సీపీ వివరించారు. ఉత్సవాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, క్రమశిక్షణతో వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ గొడవలు, అల్లర్లకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు రిజిస్ట్రీపై అవగాహన..!

- **సెప్టెంబర్ 30లోగా 100 శాతం పూర్తి చేయాలి**
- **రైతు ఐడీ లేకుండా పంటల కొనుగోళ్లు, ఎరువుల బుకింగ్‌కు ఇబ్బందులు**
- **రైతులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నమోదు పూర్తి చేయాలి**

శాయంపేట, సెప్టెంబర్ 22,డి డి 9వార్త

శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలో రైతు రిజిస్ట్రీ నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని రైతులకు రైతు రిజిస్ట్రీ ప్రాధాన్యత,నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.గ్రామ సర్పంచ్ మంద టీనా, వ్యవసాయ విస్తరణ అధికారి అన్వేష్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏ ఓ ప్రియదర్శిని మాట్లాడుతూ 2026 జనవరి 1 నుంచి ఆగస్టు 13 మధ్య కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులతో పాటు,ఇప్పటివరకు రైతు రిజిస్ట్రీ చేయించుకోని పాత రైతులు తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రత్యామ్నాయంగా సమీప మీసేవా కేంద్రాల్లో కూడా రైతు రిజిస్ట్రీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు.వరి,పత్తి తదితర పంటల కొనుగోళ్లకు రైతు ఐడీ తప్పనిసరి అవుతుందని, అలాగే ఫ్రేమ్ వర్క్ ఫర్టిలైజర్ ఆప్ ద్వారా ఎరువుల బుకింగ్ చేసుకోవాలన్నా రైతు రిజిస్ట్రీ నమోదు అవసరమని వివరించారు.పంట రుణాలతో పాటు కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ సంక్షేమ పథకాలు,ఇతర ప్రయోజనాలు పొందేందుకు కూడా రైతు రిజిస్ట్రీ కీలకమని పేర్కొన్నారు.

22 నుంచి ప్రత్యేక డ్రైవ్....

రైతు రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేసేందుకు సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రియదర్శిని తెలిపారు.ఈ ప్రత్యేక కార్యక్రమంలో రైతులు,ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు,వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హత కలిగిన రైతు రిజిస్ట్రీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

100 శాతం నమోదు లక్ష్యం...

మరణించిన రైతులు,భూమిని విక్రయించిన కేసులను మినహాయించి సెప్టెంబర్ 30వ తేదీ నాటికి 100 శాతం రైతు రిజిస్ట్రీ పూర్తి చేయాలని సూచించారు.గ్రామ ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు రైతులతో సమన్వయం చేసుకుని వారికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వ సేవలు,వ్యవసాయ సంబంధిత ప్రయోజనాలు సులభంగా అందాలంటే రైతు రిజిస్ట్రీ నమోదు పూర్తి చేసుకోవడం అవసరమని అధికారులు స్పష్టం చేశారు. రైతులు ఈ ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకుని తమ రిజిస్ట్రీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.



ఉత్సవాల్లో భక్తిభావం, సామరస్యం చాటాలి: ఆర్డీవో విజయకుమారి

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 22(డీడీ9 వార్త) :

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బోధన్ ఆర్డీవో విజయకుమారి పట్టణ ప్రజలకు సూచించారు. జంగం గల్లీలోని శివ గణేశ్ మండలి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన విశేష పూజలు, అన్నదాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ వేడుకలకు తహసీల్దార్ విట్టల్, మున్సిపల్ చైర్‌పర్సన్, ఫ్లోర్ లీడర్ తూము పద్మశరత్ రెడ్డి దంపతులు, పట్టణ సీఐ వెంకటనారాయణతో కలిసి విచ్చేసిన ఆమె.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. నవరాత్రుల పురస్కరించుకుని మండలుల వద్ద ప్రశాంత వాతావరణంలో పూజాధికాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శోభాయాత్ర, నిమజ్జన సమయాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పోలీసులకు, అధికారులకు సహకరిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవ కమిటీలు సామాజిక బాధ్యతతో ఇలాంటి అన్నదాన, సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఆమె కొనియాడారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆర్డీవో, తహసీల్దార్ల చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులు, కాలనీవాసులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు. అనంతరం మండలి ప్రతినిధులు ఆర్డీవో సహా ఇతర అధికారులను, ప్రజాప్రతినిధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శివాలయం అభివృద్ధి కమిటీ సభ్యుడు లక్ష్మణ్ రావు పటేల్, సార్వజనిక్ గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూజారి లింగం, వీడీసీ ప్రధాన కార్యదర్శి బీర్కూర్ శంకర్ (బుజ్జి), కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంకు దాము, కౌన్సిలర్లు ఆదినారాయణ, శంకర్, చిరంజీవి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు పసులేటి గోపికిషన్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు గౌతమ్ గౌడ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కాలనీ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.











రిమ్స్ అగ్నిప్రమాదంపై ప్రభుత్వ తీరుపై రాథోడ్ బాపురావు ఆగ్రహం

- **చిన్నారుల ప్రాణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి**
- **తెలంగాణ రక్షణ సేన టి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు**

ఆదిలాబాద్ జిల్లా (బ్యూరో): సెప్టెంబర్ 22: (డిడి 9 వార్త న్యూస్):

ఆదిలాబాద్ రిమ్స్* ఆసుపత్రిలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులను తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పరామర్శించారు. *రిమ్స్‌తో పాటు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

రిమ్స్‌లో భద్రతా ఏర్పాట్లు ఏమయ్యాయి.ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన *ప్రభుత్వ ఆసుపత్రిలోనే చిన్నారులు అగ్నిప్రమాదానికి గురికావడం బాధాకరమన్నారు. రిమ్స్‌లో భద్రతా ఏర్పాట్లు, అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో ఈ ఘటనతో స్పష్టమవుతోందని విమర్శించారు. ఆసుపత్రి నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులు,సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం విచారణకు పరిమితం కాకుండా రిమ్స్‌లోని భద్రతా లోపాలను వెంటనే సరిచేయాలని కోరారు.బాధితుల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలి అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని రాథోడ్ బాపురావు అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల వైద్య ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు తగిన పరిహారం అందించాలని కోరారు. రిమ్స్‌లో అగ్నిమాపక, విద్యుత్, అత్యవసర భద్రతా వ్యవస్థలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి లోపాలను సరిచేయాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాథోడ్ బాపురావు డిమాండ్ చేశారు.విరితో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ మాడవి బాపురావు ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జ్ వేణు గోపాల్ యాదవ్ మరియు టి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

గణేశ్ నిమజ్జనం వేళ నిజామాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

- **-ఈ నెల 24 నుంచి 26 వరకు వాహనాల దారిమళ్లింపు**
- **-నగరంలోకి భారీ వాహనాల ప్రవేశం నిషేధం**
- **-సీపీ పి.సాయి చైతన్య వెల్లడి**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 22(డీడీ9 వార్త) :

నిజామాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాల సందర్భంగా ప్రయాణికులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ నెల 24 నుంచి 26 వరకు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. 24వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 26వ తేదీ ఉదయం 11 గంటల వరకు వాహనాలను నిర్దేశిత మార్గాల్లో దారిమళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ, వర్ని మార్గాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నగర పరిధిలోని బైపాస్ మార్గాలు, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేస్టేషన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశామని వివరించారు. కంటేశ్వర్ రైల్వే అండర్‌పాస్ వద్ద ఎత్తు పరిమితి 13 అడుగులు మాత్రమే ఉన్నందున, ఆ లోపు ఎత్తు ఉండే విగ్రహాలను మాత్రమే అండర్‌పాస్ గుండా అనుమతిస్తామని, 13 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ప్రధాన రథం వెళ్లిన అనంతరం ఫ్లైఓవర్ మీదుగా తరలించాలని సూచించారు. ఈ మూడు రోజుల పాటు నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదని, ప్రజలందరూ పోలీసులకు సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వయోవృద్ధుల సేవా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 22(డీడీ9 వార్త) :

వచ్చే నెల 1న నిర్వహించే 'అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం' పురస్కరించుకుని ఇచ్చే రాష్ట్రస్థాయి పురస్కారాల కోసం జిల్లా నుంచి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి డి.సౌందర్య తెలిపారు. సమాజాభివృద్ధి, విద్యాబోధన, వైద్యం, సాహిత్యం, సంస్కృతి, క్రీడలు, పర్యావరణం తదితర రంగాల్లో ప్రత్యేక సేవ లందించిన వయోవృద్ధులతో పాటు, వారి సంక్షేమానికి నిరంతరం తోడ్పడుతున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు నామినేషన్లు వేసుకోవచ్చని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి ప్రతి విభాగం నుంచి ఒకరి చొప్పున జిల్లా నుంచి మొత్తం ముగ్గురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు తమ సేవా వివరాలు, ధ్రువపత్రాలు, ఫొటోలను జతచేసి ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోగా నూతన కలెక్టరేట్ సముదాయంలోని రూమ్ నంబరు 17లోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే ప్రతిపాదనలను స్వీకరింబడవని స్పష్టం చేశారు.

రోగులకు అంకితభావంతో సేవ చేయండి : జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సురేష్

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 22(డీడీ9 వార్త) :

సర్కారు దవాఖానాలకు వచ్చే పేద రోగులకు అంకితభావంతో సేవలందించి ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని రెట్టింపు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ పామూరి నూతన వైద్యులకు పిలుపునిచ్చారు. టీవీవీపీ ఆసుపత్రులకు నూతనంగా ఎంపికైన సివిల్ అసిస్టెంట్ సర్జన్లతో కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని రూమ్ నంబరు 120లో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్యులు సమయపాలన పాటిస్తూ, పరస్పర సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను రోగులకు సమర్థంగా అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ సబ్ కలెక్టర్ సందీప్, డీసీహెచ్ఎస్ డాక్టర్ పి. శ్రీనివాస్ ప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విద్య పాల్గొన్నారు.



అమ్మలకు సౌకర్యంగా.. ఆర్టీసీ బస్టాండ్‌లో తల్లిపాల కేంద్రాలు


నిజామాబాద్ జిల్లా ,సెప్టెంబర్ 22(డీడీ9 వార్త):

మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికార కేంద్రం, 'బేటి బచావో బేటి పడావో' ఆధ్వర్యంలో ప్రయాణికులైన తల్లులు తమ పసికందులకు ప్రశాంతంగా, గోప్యంగా పాలిచ్చేలా బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక క్యాబిన్లను డిపో మేనేజర్లు వెంకటరమణ, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారిణి సౌందర్య మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని, ప్రయాణ సమయాల్లో తల్లులు పడే ఇబ్బందులను గుర్తించి ఈ వసతి కల్పించడం అభినందనీయమని అధికారులు కొనియాడారు. బేటి బచావో కార్యక్రమం ద్వారా మహిళలు, బాలికల సంక్షేమానికి అనేక రకాల సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, ఈఓ ప్రణతి, డీఎంసీ స్వప్న, జెండర్ స్పెషలిస్ట్ సౌమ్య, ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ పుష్ప, అకౌంటెంట్లు ఆదిత్య, సంగీత తదితరులు పాల్గొన్నారు.

సాలూర లో కన్నులపండువగా గణపయ్యల నిమజ్జన శోభాయాత్ర

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 22(డీడీ9 వార్త) :

సాలూర మండల కేంద్రంలోని సాయి నగర్‌లో బొజ్జ గణపయ్యల నిమజ్జనోత్సవం భక్తుల కోలాహలం, ఉత్సాహాల నడుమ కన్నులపండువగా సాగింది. తొమ్మిది రోజుల పాటు స్వామివారికి సేవ చేసిన భక్తజనం మంగళవారం శోభాయాత్రలో మైమరచిపోయారు. ఊరేగింపు పొడవునా పిల్లాపాపలు, యువకులు, మహిళలు నాట్యాలు చేస్తూ, జయజయధ్వానాలతో సాయి నగర్ వీధులను మారుమోగించారు. మహిళలు మంగళ హారతులతో స్వామికి స్వాగతం పలుకుతూ, కోలాటాలతో తమ భక్తిని చాటుకున్నారు. విఘ్నేశ్వరుని లడ్డూ ప్రసాదాన్ని తమ ఇంట నిలుపుకోవాలని భక్తులు ఆరాటపడ్డారు. ఈ క్రమంలో సాగిన వేలంలో పోటీపడి మరీ ప్రసాదాలు దక్కించుకున్నారు. శ్రీ మణికంఠ గణపతి లడ్డూను వడ్ల గోపాల్ రూ. 25 వేలకు పొందగా, శ్రీ బాలాజీ గణపతి లడ్డూను ఆకాష్ రూ. 8,100 లకు సొంతం చేసుకున్నారు. తమ ఇంట స్వామివారి ప్రసాదం కొలువుదీరడంపై భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం భక్తుల ఉత్సాహాల నడుమ వినాయక నిమజ్జనం ఘనంగా ముగిసింది.



శ్రీ హనుమాన్ నవయుగ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

- **ముఖ్యఅతిథిగా హాజరైన కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్.. బీఆర్ఎస్ నేత తెల్ల రవికి ఘన సన్మానం**

కోటగిరి, సెప్టెంబర్ 22 (డిడి9 వార్త):

కోటగిరి మండల కేంద్రంలో శ్రీ హనుమాన్ నవయుగ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ యాదవ్‌ను, యంగ్ డైనమిక్ యువ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత తెల్ల రవిని యువసేన ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.

విఘ్నేశ్వరుడి కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను మొదటి రోజు నుంచి భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, ఐదు రోజులు, తొమ్మిది రోజులు, చివరగా 11 రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఆటపాటలు, కోలాటాలు, భజనలు, దాండియాలతో పండుగ వాతావరణాన్ని నెలకొల్పుతూ, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నిర్వాహకులు, యువత, భక్తులు పోలీసులకు సహకరించాలని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కోరారు.





వంగిపోయిన విద్యుత్ స్తంభం..
పట్టించుకునే నాథుడెవరు?!!

- **ఐదేళ్లుగా ఇదే పరిస్థితి.. గ్రామపంచాయతీ, గ్రామసభల్లో పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం!!!**

పోతంగల్, /సెప్టెంబర్ 22 /: (డిడి9 వార్త)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ గ్రామ పాత పోతంగళ్లలోని రెండో వార్డులో విద్యుత్ స్తంభం ఒకవైపు వంగిపోయి ప్రమాదకరంగా మారింది. గత ఐదేళ్లుగా స్తంభం ఇదే పరిస్థితిలో ఉందని స్థానికులు తెలిపారు. వీచే గాలులకు స్తంభం విరిగిపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్యపై పలుమార్లు!! గ్రామపంచాయతీలో, గ్రామసభల్లో ఫిర్యాదు చేయడంతో పాటు తీర్మానాలు చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు పేర్కొన్నారు. పలువురు సర్పంచులు వచ్చి వెళ్లినా వంగిపోయిన విద్యుత్ స్తంభం సమస్య మాత్రం అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత సర్పంచ్ అయినా స్పందించాలి!!!!

ప్రస్తుతం ఉన్న సర్పంచ్ ఈ సమస్యపై దృష్టి సారించి, ప్రమాదకరంగా వంగిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని రెండో వార్డు ప్రజలు కోరుతున్నారు.

"ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది.!!! గ్రామ పంచాయతీలో, గ్రామసభలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. కనీసం ఇప్పుడైనా సర్పంచ్ గారు స్పందించి వంగిపోయిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయిస్తారన్న నమ్మకంతో ఈ విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకొస్తున్నాం" అని స్థానికులు పేర్కొన్నారు.



పిఎం శ్రీ విద్యార్థుల చందంపేట కోట క్షేత్ర పర్యటన..

చేగుంట (డిడి 9 వార్త) సెప్టెంబర్ 22

చేగుంట మండల కేంద్రంలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థులను సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్ ఏడవ తరగతి సాంఘిక శాస్త్రంలోని రాజుల కట్టడాల పాఠం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్ ఆధ్వర్యంలో చిన్న శంకరంపేట్ మండలంలోని చందంపేట గ్రామంలో ఉన్నటువంటి కోటను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నాయిని ప్రవీణ్ మాట్లాడుతూ చందంపేట గ్రామానికి గొప్ప చరిత్ర ఉందని, చందమ్మ అనే మహిళ ఈ గ్రామానికి నిర్మించిందని, ఈ కోట కూడా చరిత్రలో గొప్ప స్థానం ఉందని, ఒకప్పుడు ఈ గ్రామంలో ముత్యాలకు ప్రసిద్ధి చెందిందని, అందుకే చాలామంది ముత్యాల చందంపేట అని పిలుస్తారని వారన్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటన వలన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధ, సిఆర్పి పులి రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ ఉపసర్పంచ్ నర్సింలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా గణేశ నిమజ్జనోత్సవం..

- **కన్నీటి వీడ్కోలు పలికిన భక్తులు**
- **లక్కీ డ్రా విన్నర్ గా నిలిచిన బ్యాగరి బ్రదర్స్**

పోతంగల్ సెప్టెంబర్ 22(డిడి9 వార్త):

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని కోడిచెర్ల గ్రామంలో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న విఘ్నేశ్వరుని నిమజ్జన వేడుకలు నేడు అత్యంత వైభవంగా ముగిశాయి. పండగ వాతావరణంలో భక్తులు గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న భక్తులు, యువకులు విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచారు. మేళతాళాలు, డప్పు చప్పుళ్లు, కోలాటాలు మరియు భక్తుల 'జై బోలో గణేష్ మహారాజ్ కీ జై' అనే నామస్మరణతో పట్టణ వీధులు మార్మోగాయి. యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. స్థానిక చెరువు/నీటి వనరుల వద్ద మున్సిపాలిటీ అధికారులు , లైటింగ్ ఏర్పాట్లు చేశారు. భక్తులు పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తిభావంతో వినాయక విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చారు. "వచ్చే ఏడాది త్వరగా రావాలని" వేడుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు.



'శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు'

- **పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసనకు మెదక్ బీజేపీ మద్దతు....**

మెదక్ సెప్టెంబర్ 22 (డిడి 9 వార్త)

పాలిటెక్నిక్ విద్యార్థులకు అన్యాయం చేసేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ రాందాస్ చౌరస్తా వద్ద పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన నిరసనకు మెదక్ బీజేపీ నాయకులు పూర్తి మద్దతు పలికారు. 'శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు' అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో 97 ను ఉపసంహరించుకుని పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులపై ప్రభావం చూపే నిర్ణయాలను పునఃపరిశీలించాలని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు తమ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బి జె వై ఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.







మారుమూల ప్రజలకు చట్టాలపై అవగాహనసదస్సు

- **బోథ్ జడ్జి కే. సందీప్**

ఆదిలాబాద్ జిల్లా: ఇచ్చోడ మండలం : సెప్టెంబర్ 22: (డిడి9 వార్త న్యూస్)

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ,అడేగాం గ్రామాలలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కే. సందీప్ మాట్లాడుతూ పలు కీలక విషయాలను వెల్లడించారు చట్టాలపై అవగాహన మారుమూల పల్లెలు, గూడెలలో నివాస ముండే ప్రతి ఒక్కరూ దేశ చట్టాల పట్ల ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలి వాహన నిబంధనలు ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. వాహనానికి సంబంధించిన పత్రాలు (ఆర్సీ), ఇన్సూరెన్స్ మరియు డ్రైవింగ్ లైసెన్స్ ఎల్లప్పుడూ కలిగి ఉండాలి. సామరస్య పరిష్కారం గ్రామాల్లో ఏవైనా చిన్న చిన్న తగాదాలు లేదా వివాదాలు ఉంటే వాటిని కోర్టుల చుట్టూ తిరగకుండా సామరస్యంగా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలి.

కార్యక్రమంలో పాల్గొన్నవారు:

ఈ అవగాహన సదస్సులో దమ్మపాల్ అడ్వకేట్ , బార్ సెక్రటరీ ఠాకూర్ రూపేందర్ సింగ్, పిప్రి సర్పంచ్ కృష్ణ కాంత్ రెడ్డి న్యాయవాదులు , స్థానిక మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఘనంగా సోనాలలో గణపతుల శోభయాత్ర

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 22: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండలంలోని గణపతులు తొమ్మిది రోజులకు నిమజ్జన కార్యక్రమం ఏర్పాటు చేశారు స్థానిక రామాలయంలోని మట్టితో చేసిన వినాయకుడిని పర్యావరణ పరిరక్షణగా మట్టితో చేసినటువంటి వినాయకుడి ప్రతిమను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాలుష్యం చేయకుండా ఎటువంటి రసాయనిక పదార్థాలు వాడకుండా కేవలం మట్టితో చేసిన వినాయకుడిని తొమ్మిది రోజుల పాటు పూజించి ఘనంగా నిమజ్జనం చేయడం జరిగింది అలాగే వ్యాపారస్తులు అందరు కలిసి మార్కెట్లో బొజ్జ గణపయ్య ప్రతిష్టాపించి ఘనంగా నిమజ్జన కార్యక్రమం చేశారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు వ్యాపారస్తులు పాల్గొని డబ్బు చప్పులతో నృత్యాలతో విజయవంతం చేశారు





క్షేత్రస్థాయిలో చేయూత పెన్షన్ల సర్వే

అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 22: (డిడి 9 వార్త న్యూస్):

అదిలాబాద్ జిల్లా సోనాల మండలంలోని సాకెర (సూర్యనగర్) గ్రామంలో స్థానిక సోనాల మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ రత్నాకర్ రావు మరియు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులకు చేయూత పెన్షన్ ఆన్లైన్ చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు



అదరగొట్టిన భారత అమ్మాయిలు.. ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి గోల్డ్ మెడల్

- ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం
- మహిళల క్రికెట్ ఫైనల్లో శ్రీలంకపై 147 పరుగుల ఘన విజయం
- బ్యాటింగ్‌లో చెలరేగిన స్మృతి మంధాన (79), రిచా ఘోష్ (49నాటౌట్)
- కేవలం 6 పరుగులిచ్చి 3 వికెట్లు తీసిన దీప్తి శర్మ

డీడీ9 వార్త :

ఆసియా క్రీడలు 2026లో భారత్ బంగారు బోణీ కొట్టింది. మహిళల క్రికెట్ ఫైనల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు అద్భుత ప్రదర్శనతో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఏకంగా 147 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో భారత మహిళల జట్టు తమ గోల్డ్ మెడల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం.

ఈ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల రికార్డు స్కోరు నమోదు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగింది. కేవలం 45 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 79 పరుగులు చేసి భారీ స్కోరుకు బలమైన పునాది వేసింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ ఆఖరి ఓవర్లలో విధ్వంసం సృష్టించింది. కేవలం 22 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో అజేయంగా 49 పరుగులు సాధించి జట్టు స్కోరును 200 పరుగులు దాటించడంలో కీలక పాత్ర పోషించింది. వీరిద్దరి మెరుపులతో లంక బౌలర్లకు చుక్కలు కనిపించాయి.

అనంతరం 217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక, భారత బౌలర్ల ధాటికి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. ఆది నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి కుప్పకూలింది. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో లంక బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

ముఖ్యంగా స్పిన్నర్ దీప్తి శర్మ తన మాయాజాలంతో లంక పతనాన్ని శాసించింది. తన 4 ఓవర్ల కోటాలో కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టింది. మిగతా బౌలర్లు కూడా రాణించడంతో శ్రీలంక జట్టు 69 పరుగులకే ఆలౌట్ అయింది. శ్రేయాంక పాటిల్ చివరి వికెట్ తీయడంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత మహిళల జట్టు ఆసియా క్రీడల్లో తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది.



పాక్ క్రికెట్‌లో ముదురుతున్న వివాదం.. రిజ్వాన్ నోరు నొక్కిన పీసీబీ

- ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్న రిజ్వాన్
- బహిరంగంగా మాట్లాడకుండా రిజ్వాన్‌పై పీసీబీ ఆంక్షలు
- వివరణ ఇచ్చేందుకు అనుమతి కోరగా రెండుసార్లు తిరస్కరణ
- విచారణపై స్పష్టత కోరుతూ ఐసీసీ, ఎన్‌సీసీఐపకు లేఖలు రాసిన రిజ్వాన్
- రిజ్వాన్ మొబైల్ ఫోన్‌ను ఇంకా తిరిగి ఇవ్వని పీసీబీ భద్రతా బృందం


డీడీ9 వార్త :

పాకిస్థాన్ క్రికెట్‌లో సీనియర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌పై జరుగుతున్న విచారణ వ్యవహారం మరో కీలక మలుపు తీసుకుంది. తనపై వచ్చిన అవినీతి, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆరోపణలపై బహిరంగంగా మాట్లాడకుండా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అతనిపై ఆంక్షలు విధించింది. ఈ వివాదంపై తన వాదనను ప్రజల ముందు ఉంచేందుకు రిజ్వాన్ చేసిన ప్రయత్నాలను పీసీబీ అడ్డుకోవడం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇటీవలే ఇంగ్లండ్ పర్యటన నుంచి అర్ధాంతరంగా స్వదేశానికి పంపిన ఏడుగురు ఆటగాళ్లలో రిజ్వాన్, ఇమామ్‌ఉల్‌హక్ కూడా ఉన్నారు. 'ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్', అవినీతి ఆరోపణల నేపథ్యంలో పాకిస్థాన్ నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సీసీఐఏ) వీరిని విచారిస్తోంది. ఇందులో భాగంగా వారిని సుమారు రెండు గంటల పాటు ప్రశ్నించడమే కాకుండా వారి మొబైల్ ఫోన్లను కూడా పీసీబీ భద్రతా బృందం స్వాధీనం చేసుకుంది.

పాకిస్థాన్‌కు చెందిన 'జియో న్యూస్' కథనం ప్రకారం.. ఈ మొత్తం వివాదంపై బహిరంగంగా వివరణ ఇచ్చేందుకు రిజ్వాన్ రెండుసార్లు పీసీబీ అనుమతి కోరాడు. తనపై వచ్చిన ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని భావించాడు. అయితే, సెంట్రల్ కాంట్రాక్ట్‌లోని క్లాజ్ 4.1 ప్రకారం బోర్డు అనుమతి తప్పనిసరి కావడంతో అతడు అభ్యర్థించాడు. కానీ, పీసీబీ అతని విజ్ఞప్తులను రెండుసార్లూ తిరస్కరించింది. పీసీబీని నిందించే ఉద్దేశం తనకు లేదని, కేవలం తన వాదనను మాత్రమే వినిపించాలనుకున్నట్లు రిజ్వాన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఈ క్రమంలోనే ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్‌కు కూడా రిజ్వాన్ ఒక లేఖ రాశాడు. విచారణ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని కోరాడు. మరోవైపు ఎన్‌సీసీఐఏకు కూడా అతడు ఘాటుగానే సమాధానం ఇచ్చాడు. "ఈ కేసులో ఎన్‌సీసీఐఏ ఎందుకు విచారణ జరుపుతుందో అర్థం కావడం లేదు. నాపై ఉన్న ఆరోపణల పూర్తి వివరాలు అందిస్తేనే విచారణకు సహకరించగలను" అని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఇప్పటికీ రిజ్వాన్ మొబైల్ ఫోన్‌ను తిరిగి ఇవ్వలేదని, ఫోన్‌లోని లావాదేవీలపై పీసీబీ లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.



మహిళా క్రికెట్ జట్టుకు స్వర్ణం.. అభినందించిన ఐసీసీ చైర్మన్, బీసీసీఐ కార్యదర్శి

- ఆసియా క్రీడల క్రికెట్‌లో స్వర్ణం సాధించిన భారత మహిళల జట్టు
- ఫైనల్‌లో శ్రీలంకపై 147 పరుగుల భారీ తేడాతో గెలుపు
- 2026 ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు ఇదే తొలి స్వర్ణ పతకం
- విజేత జట్టును అభినందించిన ఐసీసీ చైర్మన్ జైషా, బీసీసీఐ కార్యదర్శి సైకియా
- గతంలో గెలిచిన టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకున్న భారత్

డీడీ9 వార్త :



ఆసియా క్రీడలు 2026లో భారత మహిళల క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. జపాన్‌లోని నిషిన్ నగరంలో గల కొరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంకపై 147 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు, 2026 క్రీడల్లో దేశానికి తొలి స్వర్ణాన్ని అందించడమే కాకుండా, 2023లో సాధించిన టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది.

ఈ చారిత్రక విజయం పట్ల ఐసీసీ చైర్మన్ జై షా, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా భారత జట్టుకు అభినందనలు తెలిపారు. టోర్నీ ఆద్యంతం జట్టు ప్రదర్శించిన నిలకడను, అద్భుతమైన ఆటతీరును వారు కొనియాడారు. క్రికెట్ విభాగం ద్వారా ఆసియా క్రీడల్లో భారత్ స్వర్ణ పతకాల ఖాతా తెరవడం గర్వకారణమని వారు ప్రశంసించారు. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, రిచా ఘోష్ అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో రాణించారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు, భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేక కేవలం 69 పరుగులకే కుప్పకూలింది.ఈ ఘనతపై ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సహా పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా మహిళా జట్టుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

టీమిండియాతో ఓడినా గర్వంగా ఉంది.. ప్రపంచ అత్యుత్తమ జట్టుకు చెమటలు పట్టించాం

- టీ20 మ్యాచ్‌లో భారత్‌పై జపాన్ అద్భుత పోరాటం
- కేవలం 2 పరుగుల తేడాతో గట్టెక్కిన టీమిండియా
- ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టును చివరి బంతి వరకు నిలువరించడం గర్వంగా ఉందన్న జపాన్ కెప్టెన్
- ఈ గెలుపుతో 200వ టీ20 విజయాన్ని నమోదు చేసిన టీమిండియా

డీడీ9 వార్త :



చారిత్రక టీ20 మ్యాచ్‌లో పసికూన జపాన్ చేతిలో టీమిండియాకు అనూహ్య పరాభవం తృటిలో తప్పింది. సొంత అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో జపాన్ అద్భుత పోరాట పటిమ కనబరిచింది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో భారత్ కేవలం 2 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఈ విజయంతో భారత్ తన 200వ టీ20 గెలుపును (సూపర్ ఓవర్‌లతో కలిపి) నమోదు చేసుకుంది.

మ్యాచ్ అనంతరం జపాన్ కెప్టెన్ కెండెల్ కడోవాకిఫ్లెమింగ్ మాట్లాడుతూ.. తమ జట్టు ప్రదర్శన పట్ల గర్వంగా ఉందని అన్నాడు. "ఇంత దగ్గరగా వచ్చి ఓడిపోవడం కాస్త ఎక్కువ బాధ కలిగిస్తుంది. అయినప్పటికీ, నా అభిప్రాయం లో ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టును చివరి బంతి వరకు తీసుకురావడం చాలా ప్రత్యేకమైన విషయం. మా జట్టు ప్రదర్శన పట్ల గర్వపడుతున్నాను" అని తెలిపాడు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జపాన్ క్రికెట్ పురోగతిని ప్రశంసించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చెప్పాడు.

ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను జపాన్ బౌలర్లు 32 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం 33 పరుగుల లక్ష్య ఛేదనలో 'ఏదైనా సాధ్యమే' అనే నమ్మకంతో బరిలోకి దిగామని కెప్టెన్ ఫ్లెమింగ్ అన్నాడు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్ వంటి ప్రపంచ స్థాయి స్పిwwన్నర్లను ఎదుర్కోవడం సవాల్‌గా నిలిచిందని, అయినా చివరి వరకు పోరాడామని పేర్కొన్నాడు. ముఖ్యంగా 17 ఏళ్ల యువ బౌలర్ చార్లీ హింజే 17 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టడంపై ప్రశంసలు కురిపించాడు.

ఈ మ్యాచ్ నిర్వహణకు సహకరించిన టైటిల్ స్పాన్సర్ సుజుకి, బీసీసీఐ, జపాన్ క్రికెట్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. వాలంటీర్లు, గ్రౌండ్ సిబ్బంది రాత్రంతా శ్రమించి మ్యాచ్‌కు మైదానాన్ని సిద్ధం చేశారని గుర్తు చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో తమలో ఆత్మవిశ్వాసం పెరిగిందని, తదుపరి మ్యాచ్‌లలో గెలిచి ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు చేరుకోవడమే తమ లక్ష్యమని ఫ్లెమింగ్ ధీమా వ్యక్తం చేశాడు.

గాయాలతో పోరాడి.. చివరికి వీడ్కోలు.. ఇంగ్లాండ్ స్టార్ పేసర్ రిటైర్మెంట్

- గాయాల కారణంగా టెస్టులు, వన్డేలు ఆడటం సాధ్యం కాదన్న వైద్యులు
- 38 టెస్టుల్లో 119 వికెట్లు తీసిన వుడ్
- 2019 ప్రపంచకప్ విజయంలో 18 వికెట్లతో కీలక పాత్ర
- 2022 టీ20 ప్రపంచకప్‌లో 9 వికెట్లు
- టీ20ల్లో ఇంగ్లాండ్ తరఫున 54 వికెట్లు

డీడీ9 వార్త :



ఇంగ్లాండ్ స్టార్ పేసర్ మార్క్ వుడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గాయాల కారణంగా గత ఏడాది కాలంగా ఆటకు దూరంగా ఉంటున్న 36 ఏళ్ల వుడ్.. ఇక టెస్టులు, వన్డేలు ఆడటం సాధ్యం కాదని వైద్యులు సూచించినట్లు తెలిపాడు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు.

2015లో న్యూజిలాండ్‌తో లార్డ్స్‌లో జరిగిన టెస్టుతో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వుడ్.. 38 టెస్టుల్లో 119 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ తరఫున నాలుగు యాషెస్ సిరీస్‌ల్లో ఆడాడు. 2015లో ట్రెంట్‌బ్రిడ్జ్‌లో జరిగిన మ్యాచ్‌లో కీలక వికెట్ తీసి ఇంగ్లాండ్‌కు యాషెస్ అందించడంలో ప్రధాన పాత్ర పోషించాడు.

2019 వన్డే ప్రపంచకప్ విజయంలోనూ వుడ్ కీలకంగా నిలిచాడు. ఆ టోర్నీలో 18 వికెట్లు తీసిన అతడు గంటకు 95 మైళ్లకు పైగా వేగంతో బంతులు విసిరి ఆకట్టుకున్నాడు. 2022 టీ20 ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టులోనూ అతడు సభ్యుడే. ఆ టోర్నీలో నాలుగు మ్యాచ్‌ల్లో 9 వికెట్లు తీసుకున్నాడు. ఇంగ్లాండ్ తరఫున 38 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 54 వికెట్లు తీసుకున్న వుడ్.. ఆ జట్టు తరఫున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్లలో ఆరో స్థానంలో ఉన్నాడు. 70 వన్డేల్లో 80 వికెట్లు సాధించాడు. "ఇది నాకు సహజమైన ముగింపులా అనిపించింది. గాయాల నుంచి తిరిగి వచ్చి నిరూపించుకునేందుకు బలంగా ప్రయత్నించాను. కానీ ఈసారి ఆ పోరాటంలో ఓడిపోయాను. ఇంగ్లాండ్ తరఫున ఆడటం నా జీవితంలో గొప్ప గౌరవం" అని వుడ్ తెలిపాడు. వుడ్ రిటైర్మెంట్‌పై ఇంగ్లాండ్ పురుషుల క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ స్పందించాడు. యాషెస్ విజయాలు, రెండు ప్రపంచకప్ విజయాల్లో వుడ్ పాత్రమరువలేనిదని కొనియాడాడు.

కార్తికేయ కంబ్యాక్

‘ఆర్ఎక్స్ 100’, ‘బెదురులంక 2012’ లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించారు హీరో కార్తికేయ గుమ్మకొండ. ఇప్పుడాయన ‘కంబ్యాక్’ అనే సినిమాతో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇది ఆయన హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కిస్తున్న తొలి చిత్రం. కార్తికేయ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై ఆయన సతీమణి లోహితా రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం కార్తికేయ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర గ్లింప్స్‌ని విడుదల చేశారు. “బాక్సింగ్ వరల్డ్‌లో తన పేరు వినిపించి మూడేళ్లవుతోంది. నేనింకా ప్రొఫెషన్ మారిపోయి ఉంటాడేమో అనుకున్నా” అనే వాయిస్ ఓవర్‌తో ఈ గ్లింప్స్ మొదలవడం.. బాక్సింగ్ ప్రాక్టీస్‌లో ఉన్న హీరోని చూపించడం.. అందులో ప్రొఫెషనల్ బాక్సర్‌లా తను కనిపించిన తీరు ఆసక్తిరేకెత్తించాయి.




ఆ నిర్మాతతో పడక పంచుకుంటే అవకాశం ఇస్తానన్నారు..

బాలీవుడ్ టాలెంటెడ్ నటి అంకితా లోఖండే సినిమా ఇండస్ట్రీలో తాను ఎదుర్కొన్న భయానక అనుభవం గురించి తాజాగా బయటపెట్టారు. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న క్యాస్టింగ్ కౌచ్ వేధింపుల గురించి ఆమె చేసిన కామెంట్లు ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారాయి. చిన్న వయసులోనే ఇండస్ట్రీలో ఎంతటి నీచమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందో ఆమె వివరించారు. అంకితా లోఖండే ఆ రోజులను గుర్తుచేసుకుంటూ, తనకు అప్పుడు కేవలం 19 ఏళ్లు మాత్రమేనని, హీరోయిన్ కావాలనే కలలతో ఇండస్ట్రీకి వచ్చానని చెప్పారు. ఒక ఆడిషన్ తర్వాత వాళ్లు తనను సెలక్ట్ చేశామని, కాంట్రాక్ట్ సంతకం చేయడానికి రమ్మని పిలిచారని తెలిపారు. ఆ ఆనందంతో వెంటనే తాను తన తల్లికి ఫోన్ చేసి ఆ గుడ్ న్యూస్ చెప్పానని అన్నారు. అయితే ఆఫీస్‌కు వెళ్లిన తర్వాత అక్కడ అసలు రూపం బయటపడిందని ఆమె తెలిపారు.

తన కోఆర్డినేటర్‌ను బయటే ఉంచి తనను ఒక్కదాన్నే లోపలికి పిలిచారని, ఆ తర్వాత వాళ్లు తనను కాంప్రమైజ్ కావాలని డిమాండ్ చేశారని చెప్పారు. ఆ మాట అర్థం ఏంటో స్పష్టంగా అడిగితే, నేరుగా నిర్మాతతో పడక పంచుకుంటే అవకాశం ఇస్తామని చెప్పారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆ పరిస్థితుల్లో తాను ఏమాత్రం భయపడిపోలేదని, ధైర్యంగా నిలబడి గట్టిగా బుద్ధి చెప్పానని అంకితా వెల్లడించారు. వెంటనే తాను లేచి నిలబడి, మీ నిర్మాతకు కావాల్సింది టాలెంట్ కాదు, కేవలం బెడ్ షేర్ చేసుకోవడానికి ఒక అమ్మాయి అంతేనని, కానీ ఆ అమ్మాయిని తాను కాదని ముఖంపైనే చెప్పేసి బయటకు వచ్చేశానని తెలిపారు. ఆ రోజే తాను ఒక కఠినమైన నిర్ణయం తీసుకున్నానని, ఇండస్ట్రీలో ఎక్కడా తనను అలాంటి నీచమైన కోరిక కోరే సాహసం ఏ ఒక్కరూ చేయకూడదని గట్టిగా నిశ్చయించుకున్నానని అంకితా పేర్కొన్నారు. ప్రస్తుతం నెటిజన్లు ఆమెకు పెద్దఎత్తున మద్దతుగా నిలుస్తున్నారు.



‘ఆదర్శ కుటుంబం’ విడుదల వాయిదా.. వచ్చేది ఎప్పుడంటే?



వెంకటేశ్ (Venkatesh) ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47’ (Aadarsha Kutumbam house no 47) విడుదల వాయిదా పడింది. త్రివిక్రమ్ (Trivikram) దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అక్టోబరు 2న విడుదల కావాల్సి ఉండగా, మరో వారం ఆలస్యం కానుంది. అక్టోబరు 9న (adarsha kutumbam venkatesh movie release date) ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ పేర్కొంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ‘ఆదర్శ కుటుంబం’లో శ్రీనిధిశెట్టి (Srinidhi Shetty) కథానాయిక. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.



నాపై అలాంటి విమర్శలు చేయడం మూర్ఖత్వమే అవుతుంది..


మెగాస్టార్ చిరంజీవిపై గత కొంతకాలంగా కొందరు పనిగట్టుకుని నెగెటివిటీని స్ప్రెడ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన ఎంతో నిస్వార్థంగా నడిపిస్తున్న బ్లడ్ బ్యాంక్‌పై కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తూ, అక్కడి రక్తాన్ని అమ్ముకుంటున్నారంటూ దారుణమైన ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా ఇండస్ట్రీకి వచ్చి 48 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మెగా యూత్ ఫోర్స్ ఫ్యాన్స్ మీట్‌లో పాల్గొన్న చిరంజీవి.. ఈ ఆరోపణలపై స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో ఎన్నో అవమానాలు, విమర్శలు ఎదుర్కొన్నానని చెప్పిన మెగాస్టార్.. బ్లడ్ బ్యాంక్‌పై వస్తున్న విమర్శలు పూర్తిగా అర్థరహితమని కొట్టిపారేశారు. తాను సినిమాల్లో తీసుకునే భారీ పారితోషికంతో సమానమైన డబ్బులను రక్తం అమ్మడం ద్వారా సంపాదించాలంటే.. అసలు ఎన్ని కోట్ల రక్తం ప్యాకెట్లు విక్రయించాల్సి వస్తుందో ఆ విమర్శలు చేసేవారికి బుద్ధి ఉందా అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఎవరి దగ్గరా ఎలాంటి డొనేషన్లు తీసుకోకుండా కేవలం తన కష్టార్జితంతోనే ఈ బ్లడ్ బ్యాంక్‌ను ఎంతో పవిత్రంగా నడిపిస్తున్నానని చిరంజీవి స్పష్టం చేశారు. అలాంటి సేవా కార్యక్రమంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం కేవలం మూర్ఖత్వమేనని, అందుకే అలాంటి పనికిమాలిన విమర్శలను తాను ఎప్పుడూ పట్టించుకోనని తేల్చిచెప్పారు.



డబ్బు కంటే మానసిక ప్రశాంతతే విలువైనది

కోలీవుడ్ బ్యూటీ ఐశ్వర్యలక్ష్మి తీసుకున్న ఒక సంచలన నిర్ణయం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. కెరీర్ పరంగా దూసుకుపోతున్న ఈ సమయంలో ఆమె సోషల్ మీడియాకు పూర్తిగా గుడ్‌బై చెప్పడం వెనుక ఉన్న అసలు కారణాలను బయటపెట్టారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఏదో కొద్దిరోజులు గ్యాప్ ఇద్దామని ఈ నిర్ణయం తీసుకోలేదని ఆమె స్పష్టం చేశారు. నేడు విపరీతంగా పెరిగిపోయిన ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని కొందరు ఎంత నీచంగా వాడుకుంటున్నారో చూసి తాను తీవ్రంగా విసిగిపోయినట్లు తెలిపారు. ముఖ్యంగా సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ ఏఐ ద్వారా అసభ్యకరంగా ఫొటోలు, వీడియోలను ఎడిట్ చేసి పోస్ట్ చేస్తున్న సంస్కృతిని చూశాక.. తనకు ఆ నెట్‌వర్క్ మీద అసహ్యం వేసిందని వాపోయారు. ఈ డిజిటల్ పిచ్చికి దూరంగా ఉండటం వల్లే తన రియల్ లైఫ్‌లో అసలైన స్వేచ్ఛ దొరికిందని ఐశ్వర్యలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు.


అయితే ఈ నిర్ణయం వల్ల ఆర్థికంగా భారీ నష్టం తప్పదని ఆమె మేనేజర్ స్వయంగా హెచ్చరించినట్లు తెలిపారు. "దయచేసి మీ సోషల్ మీడియా అకౌంట్స్ మళ్లీ ఓపెన్ చేయండి.. లేదంటే బ్రాండ్స్, ప్రమోషన్స్ కోల్పోయి బోలెడు డబ్బు నష్టపోతారు" అని మేనేజర్ చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. కానీ, కోట్ల రూపాయల కంటే తనకు దొరికిన ఈ మానసిక ప్రశాంతతే వేల రెట్లు విలువైనదని తాను భావించినట్లు స్పష్టం చేశారు. గతంలో సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్, నెగెటివ్ కామెంట్లు తన మనసుపై తీవ్ర ప్రభావం చూపాయని ఐశ్వర్యలక్ష్మి ఎమోషనల్ అయ్యారు. ఆ కామెంట్లు రోజూ చదవడం వల్ల ఈ ప్రపంచమంతా తనకే వ్యతిరేకంగా ఉందనే భ్రమ కలిగేదని, అసలు తనను ఇష్టపడేవారే లేరనే డిప్రెషన్‌లోకి వెళ్లిపోయినట్లు ఆమె వెల్లడించారు.



స్టార్స్ ఉన్న సెట్‌లో గౌరవం దక్కదు: మనోజ్ బాజ్‌పాయ్

మూడు దశాబ్దాలకు పైగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను మెప్పిస్తున్న మనోజ్ బాజ్‌పాయ్.. తాజాగా తన కెరీర్ గురించి, సినిమా ఎంపికలపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. కమర్షియల్ సినిమాలకు బదులుగా చిన్న బడ్జెట్ చిత్రాలకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వడంపై ఆయన రియాక్ట్ అయ్యారు. కమర్షియల్ సినిమాలు తనకు నటన పరంగా పెద్దగా కొత్త అనుభూతిని ఇవ్వలేకపోతున్నాయని మనోజ్ బాజ్‌పాయ్ తెలిపారు. ఒకవేళ ఎవరైనా తనను భారీగా డబ్బులిచ్చి, లైఫ్‌ను సెటిల్ చేసి, మంచి ట్రిప్‌లకు పంపేలా ఉంటే అప్పుడు కాంప్రమైజ్ అయ్యే విషయం గురించి ఆలోచిస్తానని, లేదంటే తనకు ఆ పెద్ద సినిమాలపై పెద్దగా ఆసక్తి లేదని ఆయన తేల్చిచెప్పారు. కానీ ఒక నటుడిగా తన ఆశలన్నింటినీ చిన్న బడ్జెట్ సినిమాలే నెరవేరుస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. తమకు మంచి కథలు, గౌరవంతో పాటు కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే గొప్ప పాత్రలు కూడా దక్కుతాయని ఆయన వెల్లడించారు. పెద్ద స్టార్ల సినిమాలలో కేవలం ఒక చిన్న పాత్ర కోసం పనిచేయడానికి తాను అసలు ఇష్టపడనని మనోజ్ కుండబద్దలు కొట్టారు. సెట్లో అందరూ ఆ స్టార్ హీరో ఎప్పుడొస్తారా అని ఎదురుచూడటం, సినిమా మొత్తం ఒక్కరి చుట్టూనే తిరగడం వంటి వాతావరణంలో తాను ఇమడలేనని చెప్పారు. ఎలాంటి కమర్షియల్ లేదా కెరీర్ గ్రోత్ లేనప్పుడు అలాంటి ప్రాజెక్ట్‌స్‌లో తాను భాగం కావడం వ్యర్థమని, అక్కడ గౌరవం కూడా దక్కదని ఆయన అభిప్రాయపడ్డారు. తాను ఎప్పుడూ కొత్తదనాన్ని కోరుకునే వ్యక్తినని, రోజూ సెట్‌కు వెళ్లి జీవితాంతం చేసిన అవే రొటీన్ పనులను మళ్లీ మళ్లీ చేయడం తనకు బోర్ కొట్టిందని మనోజ్ చెప్పుకొచ్చారు. ఒక చిన్న సినిమా తక్కువ పారితోషికం ఇచ్చినా పర్వాలేదని, కానీ షూటింగ్ ముగించుకుని ఇంటికి వెళ్లేటప్పుడు ఆ రోజు చేసిన పని తనకు మనసారా పూర్తి సంతృప్తిని ఇస్తుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

బడా నిర్మాణ సంస్థతో చేతులు కలిపిన మెగాప్రిన్స్..



మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ ఇటీవల ‘కొరియన్ కనకరాజు’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయం అందుకున్నాడు. 2017లో వచ్చిన ‘ఫిదా’ తర్వాత.. మళ్లీ ఇన్నాళ్లకు ‘KOKA’తో కంబ్యాక్ ఇచ్చాడు వరుణ్. దీంతో ఇప్పుడు సినీ కెరీర్‌పై గట్టి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తుండగా.. తన తదుపరి చిత్రాల కోసం ఆచి తూచి అడుగులు వేస్తున్నాడట వరుణ్. ఇందులో భాగంగానే ఈ మెగాప్రిన్స్ ఓ స్టార్ నిర్మాణ సంస్థతో చేతులు కలిపాడట. కోకా విజయం తర్వాత, మరో రెండు పెద్ద నిర్మాణ సంస్థలు రాబోయే చిత్రాల కోసం వరుణ్ తేజ్‌కు అడ్వాన్సులు ఇచ్చాయని తెలుస్తుండగా.. అందులో ఒకటి సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వస్తోందని ఫిలిమ్ వర్గాల నుంచి టాక్. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం వరుణ్ తేజ్ ‘భరి’ చిత్రంతో బిజీగా ఉన్నాడు. స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహిస్తుండగా.. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారికి కొణిదెల అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుంది. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల అయ్యేందుకు సిద్ధం అవుతుండగా.. ఈ సినిమా షూటింగ్ పూర్తి అయిన తర్వాత సుకుమార్ రైటింగ్స్ నుంచి వస్తోన్న ప్రాజెక్టుపై అఫీషియల్ అప్డేట్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు టాక్.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.